VELTHURU TELUGU DAILY

# వెలుతురు

రంగారెడ్డి, నల్గొండ : గురువారం 13.08.2026

సంపుటి : 09 సంచిక : 65 , పేజీలు : 12 , వెలరూ . 5/-

తెలుగు దినపత్రిక

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com

## సర్ ధ్రువీకరణకు ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ చెల్లదు.. ఈసీఐ క్లారిటీ




2

## బీసీ మహిళలకు ఉచిత ఆటోమేటిక్ కుట్టు మిషన్లు.. నేడే పథకం ప్రారంభం

- బీసీ మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా కొత్త పథకం
- ఉచితంగా ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ
- నియోజకవర్గానికి 1,000 మిషన్లు
- అర్హులైన బీసీ మహిళలకు లబ్ది



2

## పార్లమెంట్‌ను అడ్డుకుంటున్న విపక్షాలు నితిన్ నబిన్ తీవ్ర విమర్శలు

- వరుసగా సభా కార్యకలాపాలకు విఘాతం కలిగిస్తున్నారని ఆరోపణ
- ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకుంటున్నారని విమర్శ



3

## మిల్లర్ల నుంచి బకాయిలు వసూలు చేయాల్సిందే...

- బకాయిల వసూలుకు విధివిధానాల రూపకల్పన
- ధాన్యం నిల్వకు అయిదు నియోజకవర్గాల్లో సైలో బ్యాగ్ నిర్మాణాలు



12



2

## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఆర్మీ సదరన్ కమాండ్ చీఫ్

- భేటీలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 12:

భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పనిచేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం తెలియజేశారు. ఆర్మీ నియామకాల్లో స్థానిక యువతకు భారీ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆసక్తి చూపుతున్న, అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.దీనికి సానుకూలంగా స్పందిస్తూ దేశ వ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్మెంట్ లకు ముందు ఆయా తెలంగాణ జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాలు ఏర్పాటుకు లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ సుముఖత వ్యక్తం చేశారు.

# పేదల సొంతింటి కలకు కేంద్రం చేయూత

- మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్
- కృతజ్ఞతలు తెలిపిన మంత్రి పొంగులేటి
- తెలంగాణకు 11.56 లక్షల PMAY-G ఇళ్లు కేటాయించాలని విజ్ఞప్తి..
- తెలంగాణ పర్యటనకు కేంద్ర మంత్రికి ఆహ్వానం

హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 12:



తెలంగాణ గ్రామీణ పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన–గ్రామీణ్ (PMAY–G 2.0) కింద తెలంగాణకు 11,56,915 ఇళ్లను ఒకేసారి కేటాయించాలని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు విజ్ఞప్తి చేశారు.బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ఎంపీలు డా. మల్లు రవి, రామసహాయం రఘురామిరెడ్డి, వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేష్ షెట్కార్, మండాది అనిల్‌కుమార్ యాదవ్లతో కలిసి మంత్రి పొంగులేటి కలిశారు. తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లో పేదల గృహ అవసరాలను వివరిస్తూ కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీ.పీ. గౌతమ్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.రాష్ట్రంలో ప్రజాపాలనలో ఇళ్ల కోసం 21 లక్షల దరఖాస్తులు వచ్చాయని మంత్రి తెలిపారు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఆవాస్ ప్లస్–2024 యాప్ ద్వారా ఇంటింటా సర్వే నిర్వహించగా 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా గుర్తించబడ్డాయని చెప్పారు. సూపర్ చెక్, అనర్హుల తొలగింపు ప్రక్రియలను కూడా పూర్తి చేసినట్లు వెల్లడించారు.

▶ మిగతా 2లో



2

## గోదావరి జలాలను గరిష్ఠంగా వినియోగించుకోవాలి: సీఎం రేవంత్‌రెడ్డి

- గోదావరి జలాలపై దృష్టి
- ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతలు
- దేవాదులపై ప్రత్యేక దృష్టి
- సీతారామ ప్రాజెక్టుకు ప్రాధాన్యం
- బ్యారేజీలపై ఎన్‌డీఎస్ఏ సూచనలు
- మూడు బ్యారేజీలపై సమీక్ష
- పెండింగ్ పరిహారం చెల్లింపునకు ఆదేశం
- ముంపు గ్రామాలపై క్షేత్రస్థాయి పరిశీలన

## ఏ రాష్ట్రం లో ఓటు ఉండాలో ప్రకాష్ రాజ్ నిర్ణయించుకోవాలి: బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జనవాడే సంగప్ప

- హైదరాబాద్ లో కానిస్టేబుల్ ఆత్మహత్య పై సమగ్ర విచారణ జరిపించాలని సంగప్ప డిమాండ్

హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 12:




10

తన ఓటును బిజెపి సర్కార్ తీసేసింది అన్న సినీ నటుడు ప్రకాష్ రాజ్ వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జనవాడే సంగప్ప తీవ్రంగా మండిపడ్డారు. ప్రకాష్ రాజ్ భారత దేశంలో ఉంటూ ఇక్కడి తిండి తింటూ ఈ దేశాన్ని విమర్శించే వ్యక్తి అని సంగప్ప పేర్కొన్నారు. ప్రకాష్ రాజ్ కు నాలుగు రాష్ట్రాల్లో ఓట్లు ఉన్నాయని అంటున్నారని, ఆయన ఏ రాష్ట్రంలో ఓటు వేయాలనుకుంటున్నారో ముందుగా నిర్ణయించు కోవాలని సంగప్ప సూచించారు. తన ఓటు తొలగించారని చెబుతున్న బెంగళూరులోని శాంతినగర్ లో ప్రకాష్ రాజ్ గత నాలుగు సంవత్సరాలుగా ఉండడం లేదని బిఎల్వో తేల్చారని ఆయన చెప్పారు.



11

## ఎఫ్ సీఆర్ఏ సవరణ బిల్లు జేపీసీకి.. లోక్‌సభ ఆమోదం

- ప్రతిపాదిత బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపిన కేంద్రం
- జేపీసీ ఏర్పాటుకు లోక్‌సభ ఆమోదం
- మొత్తం 31 మంది ఎంపీలతో కమిటీ ఏర్పాటు

## తెలంగాణ వ్యవసాయ విధానాలపై బిహార్ ఆసక్తి

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల గారితో బిహార్ వ్యవసాయశాఖ మంత్రి విజయ్ కుమార్ సిన్హా భేటీ
- వ్యవసాయంలో సాంకేతికత, ఉత్పాదకత, పంటల వైవిధ్యీకరణపై చర్చించిన ఇరుమంత్రులు



2

- ఆయిల్ పామ్ పై బిహార్ ఆసక్తి.... మఖానాపై తెలంగాణ ఆసక్తి
- తమ రాష్ట్రంలోను ఆయిల్ పామ్ సాగు అమలుకు పరిశీలిస్తామన్న బిహార్ మంత్రి
- త్వరలోనే తెలంగాణకు ప్రతినిధుల బృందాన్ని పంపిస్తామన్న బిహార్ మంత్రి
- ఆయిల్ పామ్ సాగులో అవసరమైన అన్ని సహాయసహకారాలను అందిస్తామన్న మంత్రి తుమ్మల

## క్యూర్ పరిధిలో నేడు ఇందిరమ్మ టవర్స్‌కు శ్రీకారం

- కూకట్‌పల్లిలో శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి



- ఏడాదిలో గృహప్రవేశాలు జరిగేలా ప్రణాళిక
- క్యూర్ పరిధిలో ఏడాది లో లక్ష ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం

12

## కోదండరాంను అడ్డుకున్న నిరుద్యోగులు..

- “60 ఏళ్లకు మీరు ఎమ్మెల్సీ... 30 ఏళ్ల మాకు ఉద్యోగం వద్దా?”



- హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉద్రిక్తత
- ప్రభుత్వ ఉద్యోగాల వయోపరిమితిపై మాట్లాడేందుకు వచ్చిన కోదండరాం

3

## నిమిషానికి రూ.20 లక్షల అప్పు.. ప్రజలకు నిధులేవీ?: ఏలేటి మహేశ్వర్ రెడ్డి

- నిమిషానికి రూ.20.20 లక్షల అప్పు
- నాలుగు నెలల్లో రూ.34,900 కోట్ల రుణం



10

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై హైకోర్టు స్టే

- రెండు పథకాలపై మధ్యంతర ఆంక్షలు
- జీవోలతో అమలుపై పిటిషన్



- చట్టబద్ధతపై అభ్యంతరం
- విజయ్ గోపాల్ పిటిషన్

10

# సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఆర్మీ...

**విపత్తు నిర్వహణలో ఆర్మీ పాత్రపై చర్చించిన సీఎం**

రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస చర్యల్లో ఆర్మీ యంత్రాంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరిన ముఖ్యమంత్రి

తెలంగాణలో విపత్తు పరిస్థితుల్లో ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని స్థానిక ఆర్మీ అధికారులను ఆదేశిస్తానన్న లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును కొనియాడిన లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్. హైదరాబాద్ నగరాన్ని రక్షించడానికి, కాలుష్యాన్ని తగ్గించడానికి, చారిత్రక వైభవాన్ని తిరిగి తెచ్చేందుకు మూసీ నది పునరుజ్జీవనం అవసరం అని అన్నారు

భేటీలో పాల్గొన్న మేజర్ జనరల్ శ్రీనివాస్ రావు, ఇతర ఆర్మీ ఉన్నతాధికారులు

# పేదల సొంతింటి కలకు కేంద్రం

**(మొదటి పేజీ తరువాయి)**

"అర్హులైన కుటుంబాల జాబితాను రెండేళ్ల క్రితమే కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాం. తెలంగాణకు ఇళ్లు మంజూరు చేయాలని నేను పలుమార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరాను. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు కూడా అనేక దఫాలుగా కేంద్రం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. స్వయంగా ప్రధానమంత్రి గారి దృష్టికి కూడా తీసుకెళ్లారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ గారు తెలంగాణ పర్యటనకు వచ్చిన సందర్భాల్లోనూ రాష్ట్ర గృహ అవసరాలను ఆయన దృష్టికి తీసుకువచ్చాను" అని పొంగులేటి తెలిపారు.తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదల గృహ నిర్మాణం నిలిచిపోవడంతో భారీ డిమాండ్ ఏర్పడిందని, ఈ నేపథ్యంలో అర్హులైన 11,56,915 కుటుంబాలకు ఒకేసారి ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల రాష్ట్ర సాయం

PMAY-G కింద కేంద్ర వాటాతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని మంత్రి తెలిపారు. ఇందుకు అవసరమైన నిధులను ఇప్పటికే రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించినట్లు చెప్పారు."పేదలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసం కల్పించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే దాదాపు 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. కేంద్రం నుంచి PMAY-G ఇళ్ల కేటాయింపు జరిగితే గ్రామీణ పేదల సొంతింటి కలను మరింత వేగంగా నెరవేర్చగలం" అని మంత్రి అన్నారు.

తెలంగాణ పర్యటనకు రావాలని ఆహ్వానం

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాల్సిందిగా మంత్రి పొంగులేటి ఆహ్వానించారు. PMAY-G 2.0 కింద తెలంగాణకు ఇళ్ల కేటాయింపును స్వయంగా రాష్ట్రానికి వచ్చి ప్రకటిస్తే గ్రామీణ పేదలకు మరింత భరోసా కలుగుతుందని తెలిపారు.మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రి సానుకూల స్పందనకు పొంగులేటి శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# సర్ ధ్రువీకరణకు ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ చెల్లదు.. ఈసీఐ క్లారిటీ

- ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో కీలక స్పష్టత
- ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్‌ను అంగీకరించబోమన్న ఈసీఐ
- తెలంగాణ ప్రభుత్వం జులై 25న ఉత్తర్వులు
- రేషన్ కార్డు డేటా ఆధారంగా సర్టిఫికెట్ జారీకి ఆదేశాలు
- సర్టిఫికెట్ రేషన్ కార్డుతో సమానమేనని ఈసీఐ వెల్లడి
- సర్ ధ్రువీకరణ పత్రాలపై కొనసాగుతున్న చర్చ
- ఓటర్ల వివరాల పరిశీలనలో కొత్త నిబంధనలు
- తెలంగాణ ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో ఈసీఐ స్పందన
- సర్ ధ్రువీకరణకు ఏ పత్రాలు చెల్లుతాయన్న దానిపై స్పష్టత
- ఎన్నికల ప్రక్రియలో పత్రాల ప్రామాణికతపై ఈసీఐ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 12:**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో ధ్రువీకరణ పత్రంగా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్‌ను అంగీకరించబోమని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) స్పష్టం చేసింది. ఈ సర్టిఫికెట్‌ను రేషన్ కార్డుతో సమానంగా పరిగణిస్తున్నందున సర్ ధ్రువీకరణ పత్రంగా స్వీకరించడం సాధ్యం కాదని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) స్పష్టం చేసినట్లు సమాచారం.తెలంగాణ ప్రభుత్వం జులై 25న ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ జారీకి సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది. రేషన్ కార్డులోని వివరాలను ఆధారంగా చేసుకుని ఈ సర్టిఫికెట్‌ను జారీ చేసేలా ఆదేశాలు ఇచ్చింది. కుటుంబ వివరాలు, సభ్యుల సమాచారాన్ని ధ్రువీకరించేందుకు ఈ విధానాన్ని తీసుకొచ్చింది.అయితే సర్ ప్రక్రియలో ఈ సర్టిఫికెట్‌ను ధ్రువీకరణ పత్రంగా ఉపయోగించడంపై స్పష్టత కోరిన నేపథ్యంలో ఈసీఐ తన వైఖరిని వెల్లడించింది. రేషన్ కార్డు డేటా ఆధారంగానే ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ జారీ అవుతున్నందున దానిని




ప్రత్యేకమైన స్వతంత్ర ఆధారంగా పరిగణించలేమని ఈసీఐ పేర్కొన్నట్లు తెలుస్తోంది.SIRలో ఓటర్ల అర్హత, వివరాల ధ్రువీకరణకు ఎన్నికల సంఘం నిర్దేశించిన పత్రాలకే ప్రాధాన్యం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఒక పత్రం ఆధారంగా తయారైన మరో ధ్రువీకరణ పత్రాన్ని అదే సమాచారానికి స్వతంత్ర ఆధారంగా పరిగణించడం సాధ్యం కాదన్నది ఈసీఐ స్పష్టతలో ప్రధాన అంశంగా కనిపిస్తోంది.దీంతో తెలంగాణ ప్రభుత్వం జారీ చేస్తున్న ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్‌ను SIR ధ్రువీకరణ కోసం ఉపయోగించుకోవచ్చా అనే అంశంపై నెలకొన్న సందేహాలకు తెరపడినట్లయింది. ఈ సర్టిఫికెట్ జారీ ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు ఒకవైపు ఉండగా.. ఎన్నికల జాబితా సవరణలో ఏ పత్రాలను పరిగణనలోకి తీసుకోవాలన్నది ఈసీఐ పరిధిలోని అంశంగా మారింది.SIR ప్రక్రియలో పత్రాల ఆధారంగా ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్న నేపథ్యంలో ఈసీఐ తాజా స్పష్టత ప్రాధాన్యం సంతరించుకుంది. ఓటర్లు తమ ధ్రువీకరణ కోసం ఎన్నికల సంఘం ఆమోదించిన పత్రాలను మాత్రమే సమర్పించాల్సి ఉంటుంది.ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్‌ను సాధారణ పరిపాలనా అవసరాల కోసం ఉపయోగించుకోవచ్చా లేదా అనే అంశానికి ఈసీఐ తాజా స్పష్టత నేరుగా వర్తించదు. ఈ సర్టిఫికెట్ SIRలో ధ్రువీకరణ పత్రంగా చెల్లుబాటు అవుతుందా అనే అంశంపైనే ఎన్నికల సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది.దీంతో SIRలో పత్రాల సమర్పణ విషయంలో ఓటర్లు, అధికారులకు మరింత స్పష్టత వచ్చినట్లయింది. రేషన్ కార్డు ఆధారంగా జారీ చేసే ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్‌ను అదనపు స్వతంత్ర ధ్రువీకరణ పత్రంగా పరిగణించబోమని ఈసీఐ స్పష్టం చేసినట్లయింది.మొత్తంగా తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ అంశం SIR ప్రక్రియలో కొత్త చర్చకు దారితీసింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే సర్టిఫికెట్ల ప్రామాణికత, వాటిని ఎన్నికల ప్రక్రియలో ఏ మేరకు పరిగణించాలి అనే విషయంలో ఎన్నికల సంఘం నిబంధనలే తుది ఆధారంగా ఉండనున్నాయి.

# గోదావరి జలాలను గరిష్ఠంగా వినియోగించుకోవాలి: సీఎం రేవంత్‌రెడ్డి

- బస్వాపూర్, గౌరవెల్లిపై దృష్టి
- గూడెందొడ్డి సామర్థ్యంపై అధ్యయనం

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 12:**

గోదావరి జలాలను గరిష్ఠ స్థాయిలో వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్లంపల్లితో పాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేరకు నీటిని ఎత్తిపోవాలని సూచించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో నీటిపారుదల శాఖపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం సమీక్ష నిర్వహించారు.దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఎదురవుతున్న చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఎం అధికారులకు సూచించారు. దేవాదుల నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా తొమ్మిది పంపులతో ఎత్తిపోతలు చేపట్టామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు.సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకే నీటిని నిల్వ చేయడం లేదని సీఎం తెలిపారు. మేడిగడ్డతో పాటు సుందిళ్ల బ్యారేజీలోనూ అనేక లోపాలు ఉన్నట్లు తేలిందని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. మూడు బ్యారేజీలకు సంబంధించిన అంశాలపై ఎన్‌డీఎస్‌ఏను సంప్రదించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.పలు ప్రాజెక్టుల కింద ఒకట్రెండు గ్రామాల్లోని వ్యవసాయ భూములకు సంబంధించిన పెండింగ్ పరిహారాన్ని వెంటనే చెల్లించేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. నీటిపారుదల, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు, పరిహారం, పునరావాసానికి సంబంధించిన వాస్తవ పరిస్థితులపై నివేదిక రూపొందించాలని ఆదేశించారు.తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని సీఎం స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పూర్తయితే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టుల్లో నీటిని నింపే అవకాశం ఉంటుందని తెలిపారు.గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల సామర్థ్యాన్ని పెంచే అంశంపై సమగ్ర అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. గూడెందొడ్డి పంప్ స్టోరేజీ ప్రాజెక్టుకు సంబంధించి కన్సల్టెంట్‌ను నియమించాలని సూచించారు.

# బీసీ మహిళలకు ఉచిత ఆటోమేటిక్ కుట్టు మిషన్లు..

- స్వయం ఉపాధిని ప్రోత్సహించడమే ప్రభుత్వ ఉద్దేశం
- ఇళ్ల నుంచే టైలరింగ్ చేసుకునే అవకాశం
- ఆధునిక ఆటోమేటిక్ మిషన్లతో వేగంగా పని
- లబ్ధిదారుల ఎంపికపై త్వరలో మార్గదర్శకాలు
- వయసు, ఆదాయ పరిమితులపై స్పష్టత ఇవ్వనున్న ప్రభుత్వం
- దరఖాస్తు విధానం, తేదీలను ప్రకటించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 12:**

బీసీ మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక సంక్షేమ పథకానికి శ్రీకారం చుట్టనుంది. వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలకు ఉచితంగా ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించే పథకాన్ని నేడే అధికారికంగా ప్రారంభించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.

**నియోజకవర్గానికి 1,000 మిషన్లు**

స్వయం ఉపాధి ద్వారా బీసీ మహిళలు సొంత కాళ్లపై నిలబడేలా చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 1,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్ల చొప్పున అర్హులైన మహిళలకు ఉచితంగా పంపిణీ చేయనున్నారు.సాధారణ కుట్టు మిషన్లకు భిన్నంగా మహిళల శ్రమను తగ్గించేలా, తక్కువ సమయంలో ఎక్కువ పని చేసుకునేలా ఆటోమేటిక్ మిషన్లను అందించనున్నారు. దీంతో ఇంటి వద్ద నుంచే టైలరింగ్ చేసుకుంటూ ఆదాయం పొందేందుకు మహిళలకు అవకాశం ఏర్పడనుంది.

**అర్హతలపై త్వరలో స్పష్టత**

ఈ పథకానికి లబ్ధిదారులను ఏ ప్రాతిపదికన ఎంపిక చేస్తారు? దరఖాస్తు ఎలా చేసుకోవాలి? అనే అంశాలపై ప్రభుత్వం త్వరలో మార్గదర్శకాలను విడుదల చేయనుంది. లబ్ధిదారులకు ఉండాల్సిన వయోపరిమితి, కుటుంబ వార్షిక ఆదాయ పరిమితి, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తదితర వివరాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారికంగా ప్రకటన చేయనున్నారు.

**దరఖాస్తులు ఎక్కడంటే..**

ఆన్‌లైన్‌తో పాటు మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించే అవకాశం ఉంది. దరఖాస్తుల ప్రారంభ తేదీ, చివరి తేదీ, అవసరమైన పత్రాలు, లబ్ధిదారుల ఎంపిక విధానం వంటి పూర్తి వివరాలను ప్రభుత్వం వెల్లడించనుంది.

**స్వయం ఉపాధికి ప్రోత్సాహం**

బీసీ మహిళలకు కేవలం ఆర్థిక సాయం అందించడం కాకుండా, స్వయం ఉపాధికి అవసరమైన పరికరాన్ని అందించడం ద్వారా దీర్ఘకాలికంగా ఆదాయం పొందేలా చేయడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం చెబుతోంది. టైలరింగ్ నైపుణ్యం ఉన్న మహిళలు తమ ఇళ్ల నుంచే పని చేసుకుని కుటుంబ ఆదాయానికి తోడ్పడే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.నియోజకవర్గానికి 1,000 మిషన్ల చొప్పున పంపిణీ చేయడం ద్వారా పెద్ద సంఖ్యలో బీసీ మహిళలకు ప్రయోజనం కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే లబ్ధిదారుల తుది ఎంపిక, దరఖాస్తు ప్రక్రియ, అర్హతలపై అధికారిక మార్గదర్శకాలు వెలువడిన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది.

# తెలంగాణ వ్యవసాయ విధానాలపై బిహార్ ఆసక్తి

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 12:**

బీహార్ వ్యవసాయశాఖ మంత్రి శ్రీ విజయ్ కుమార్ సిన్హా బుధవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావును సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీహార్–తెలంగాణ రాష్ట్రాల మధ్య వ్యవసాయరంగంలో పరస్పర సహకారం, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, ఉత్తమ విధానాల అధ్యయనం, పంటల వైవిధ్యీకరణ తదితర అంశాలపై ఇరువురు మంత్రులు విస్తృతంగా చర్చించారు.తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న సాంకేతిక ఆధారిత కార్యక్రమాలు, రైతుల సంక్షేమం కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బీహార్ మంత్రి శ్రీ విజయ్ కుమార్ సిన్హాకు వివరించారు. వాతావరణ హెచ్చరికలను రైతులకు చేరవేయడం, రైస్ నేస్తం ద్వారా రైతులతో వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా అనుసంధానం, క్రాప్ బుకింగ్, శాటిలైట్ ఆధారిత పంటల పర్యవేక్షణ, యూరియా బుకింగ్ అప్లికేషన్, అగ్రిస్టాక్ ద్వారా రైతు గుర్తింపు వంటి డిజిటల్ కార్యక్రమాలను వివరించారు. కృత్రిమ మేధ ఆధారిత 'కృషివాస్' పంటల పర్యవేక్షణ వ్యవస్థ ద్వారా పంటల్లో సమస్యలను ముందుగానే గుర్తించి, అవసరమైన ప్రాంతాల్లోనే సత్వర చర్యలు చేపట్టడం ద్వారా రైతుల పెట్టుబడి వ్యయాన్ని తగ్గించడం, దిగుబడిని పెంచడం, లాభదాయకతను మెరుగుపర్చే విధానాలను మంత్రి తుమ్మల వివరించారు.రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తుమ్మల తెలిపారు. రాష్ట్రంలో రైతుల కోసం అమలు చేస్తున్న రైతుబంధు, రైతు బీమా, సన్న వడ్లకు బోనస్ తదితర కార్యక్రమాల అమలు తీరును బీహార్ మంత్రికి వివరించారు. రైతుల సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి సుమారు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. రైతులకు ఏకకాలంలో 2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, సంవత్సరానికి రైతుభరోసా పథకం కింద ఎకరానికి 12000 ఇస్తున్నామని తెలిపారు. సన్నాలకు 500 బోనస్ అందిస్తున్నామని, దేశంలోనే అత్యధిక వరి పండించిన రాష్ట్రం తెలంగాణే అని అన్నారు. రాష్ట్రంలో పంటల వైవిధ్యీకరణకు ఇస్తున్న ప్రాధాన్యతను కూడా మంత్రి తుమ్మల వివరించారు. తెలంగాణలో వరి, పత్తితో పాటు మొక్కజొన్న, కందులు, సోయాబీన్, మామిడి, ఎర్ర మిరప, పసుపు, ఆయిల్‌పామ్ తదితర పంటల సాగు విస్తరిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్ సాగులో తెలంగాణ దేశంలో ముందంజలో ఉందని, 2025-26లో 3.11 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు ఉండగా, 74 వేల మెట్రిక్ టన్నుల క్రూడ్ పామ్ ఆయిల్ ఉత్పత్తితో 20.01 శాతం ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో సాధించినట్లు వివరించారు. తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, నర్సరీలు, ప్రాసెసింగ్ మిల్లులు, మైక్రో ఇరిగేషన్ వంటి మౌలిక సదుపాయాలపై కూడా బీహార్ మంత్రి ఆసక్తిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇదే సమయంలో బీహార్‌లో అమలు చేస్తున్న వ్యవసాయ విధానాలు, పంటల వైవిధ్యీకరణ, పంటల క్లస్టర్ల విధానం, సాంకేతిక వినియోగం తదితర అంశాలను బీహార్ మంత్రి శ్రీ విజయ్ కుమార్ సిన్హా తెలంగాణ ప్రతినిధులకు వివరించారు. బీహార్‌లో చిన్న, సన్నకారు రైతులు 91 శాతం ఉండగా, వ్యవసాయంపై ఆధారపడే జనాభా 77 శాతంగా ఉందని, వ్యవసాయ ఉత్పత్తుల వైవిధ్యానికి అనుగుణంగా ప్రత్యేక పంటల క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మకానా, మొక్కజొన్న, పండ్లు–కూరగాయలు, తృణధాన్యాల కోసం ప్రత్యేక క్లస్టర్లను ఏర్పాటు చేసి ఉత్పత్తి, విలువ జోడింపు, మార్కెటింగ్ రంగాల్లో అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు బీహార్ ప్రతినిధులు వివరించారు. దర్భంగా, మధుబని, సీతామర్హి ప్రాంతాల్లో మకానా క్లస్టర్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. బీహార్‌లో మకానా పంటపై ప్రత్యేకంగా చేపడుతున్న కార్యక్రమాల పట్ల మంత్రి తుమ్మల ఆసక్తి కనబరిచారు. ఇటీవల మకానా ఉత్పత్తి, పరిశోధన, విలువ జోడింపు, మార్కెటింగ్, అంతర్జాతీయ అవకాశాలను పెంపొందించేందుకు మకానా బోర్డును ఏర్పాటు చేసినట్లు బీహార్ ప్రతినిధులు వివరించారు. గత పదేళ్లలో మకానా సాగు విస్తీర్ణం, ఉత్పత్తి, ఉత్పాదకత 2.5 రెట్లకు పైగా పెరిగినట్లు వివరించారు.

**ఆయిల్‌పామ్‌పై బీహార్ ఆసక్తి.. మకానాపై తెలంగాణ ఆసక్తి:**

బీహార్‌లో ఆయిల్‌పామ్ సాగు అవకాశాలపై ఆ రాష్ట్ర మంత్రి ఆసక్తి వ్యక్తం చేయగా, మంత్రి తుమ్మల బీహార్‌లో ప్రత్యేకంగా సాగవుతున్న మకానా పంట, దాని ఉత్పత్తి, విలువ జోడింపు, మార్కెటింగ్ విధానాలపై ఆసక్తి చూపారు. రెండు రాష్ట్రాల్లో రైతులకు ప్రయోజనం చేకూరే పంటల పరస్పర అధ్యయనం, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడికి దోహదం చేసుకోవాలని మంత్రి తుమ్మల కోరారు.

ఇందుకోసం ఆయిల్‌పామ్ సాగు విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు బీహార్ నుంచి వ్యవసాయశాఖ అధికారులు, ప్రతినిధుల బృందంతో పాటు రైతుల బృందాన్ని తెలంగాణకు ఆహ్వానిస్తున్నట్లు మంత్రి తుమ్మల తెలిపారు. తెలంగాణలో ఆయిల్‌పామ్ తోటలు, నర్సరీలు, ప్రాసెసింగ్ యూనిట్లు, సాగులో అనుసరిస్తున్న ఆధునిక విధానాలను వారు ప్రత్యక్షంగా పరిశీలించేలా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. అదే విధంగా మకానా సాగు, ప్రాసెసింగ్, విలువ జోడింపు, మార్కెటింగ్ విధానాలను అధ్యయనం చేసేందుకు తెలంగాణ నుంచి ప్రతినిధుల బృందాన్ని బీహార్‌కు పంపిస్తామని తెలిపారు.బీహార్‌లో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యమైన నాటుసామగ్రి, సాగు విధానాలు, మైక్రో ఇరిగేషన్, ప్రాసెసింగ్ తదితర అంశాల్లో తెలంగాణ ప్రభుత్వం తనవంతు సహాయ సహకారాలను అందించేందుకు సిద్ధంగా ఉందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.వ్యవసాయరంగంలో రెండు రాష్ట్రాలకు ఉన్న ప్రత్యేక అనుభవాలు, సాంకేతిక పరిజ్ఞానం, పంటల వైవిధ్యీకరణ విధానాలను పరస్పరం పంచుకోవడం ద్వారా రైతుల ఆదాయం పెంపు, ఉత్పాదకత మెరుగుదల, విలువ జోడింపు, మార్కెట్ అవకాశాల విస్తరణకు మరింత ప్రయోజనం కలుగుతుందని ఇరువురు మంత్రులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ–బీహార్ మధ్య వ్యవసాయ సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, హాకా ఎండి చంద్రశేఖర్ రెడ్డి, కోఆపరేటీవ్ కమిషనర్ రాహుల్ రాజ్, హార్టికల్చర్ యూనివర్సిటీ వీసీ రాజిరెడ్డి మరియు బిహార్ రాష్ట్ర వ్యవసాయశాఖ సెక్రటరీ నర్మదేశ్వర్ లాల్, వ్యవసాయశాఖ డైరెక్టర్ ముకేష్ కుమార్ లాల్, హార్టికల్చర్ డైరెక్టర్ అభిషేక్ కుమార్ పాల్గొన్నారు.



**అర్బన్ ఫార్మింగ్, మిద్దె పంటలతో ఆరోగ్యకరమైన జీవనానికి బాట**

అర్బన్ ఫార్మింగ్, మిద్దె పంటలు మరియు కిచెన్ గార్డెనింగ్‌ను నగరప్రజల్లో విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన అర్బన్ ఫార్మింగ్ & కిచెన్ గార్డెనింగ్ ఎక్స్‌పో–2026 కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. నగర ప్రజలకు తాజా ఆహారం, ఆరోగ్యకరమైన జీవనం, పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణపై అవగాహన కల్పించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. కిచెన్ గార్డెనింగ్‌కు పెద్ద స్థలం అవసరం లేదని, ఇంటి బాల్కనీ, టెర్రస్, ఇంటి ప్రాంగణం వంటి చిన్న ప్రదేశాల్లోనే కుండీలు, గ్రో బ్యాగులు, ఇతర కంటైనర్లలో కొత్తిమీర, పుదీనా, పాలకూర వంటి ఆకుకూరలు, కూరగాయలు, మూలికలను సులభంగా పెంచుకోవచ్చని మంత్రి తెలిపారు. నగరాల్లోని లక్షలాది కుటుంబాలు తమ ఇళ్లలో కొంత మేరకు ఆహారాన్ని స్వయంగా పండించుకోవడం ప్రారంభిస్తే దాని సమిష్టి ప్రభావం ఎంతో గొప్పగా ఉంటుందని అన్నారు. వ్యవసాయం కేవలం వ్యవసాయ క్షేత్రాలకే పరిమితం కాకుండా టెర్రస్‌లు, బాల్కనీలు, కమ్యూనిటీ స్థలాలు, పాఠశాలలు, కార్యాలయాలు, ఇతర సంస్థల ప్రాంగణాల్లోనూ కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, ఇతర మొక్కలను పెంచేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయాన్ని వాతావరణ మార్పులకు అనుగుణంగా మార్చుకోవాలని సూచించారు.తాజాగా పండిద్దాం – ఆరోగ్యంగా తిందాం – పచ్చగా జీవిద్దాం అనే సందేశం కేవలం నినాదంగా కాకుండా ప్రతి కుటుంబ జీవన విధానంగా మారాలని మంత్రి ఆకాంక్షించారు. ఎక్స్‌పోకు వచ్చిన ప్రజలు ఎగ్జిబిటర్లు, నిపుణులతో చర్చించి అర్బన్ ఫార్మింగ్‌లోని కొత్త సాంకేతికతలను తెలుసుకుని తమ ఇళ్లు, సంస్థలు, కమ్యూనిటీలలో గార్డెన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు నేస్తం చైర్మన్ వై. వెంకటేశ్వరరావు, ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ ఉద్యోగుల సొసైటీ సంచలనం: ఆగస్టు 15 నుంచి రూ. 15 లక్షల జీవిత బీమా పథకం ప్రారంభం

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 12:**

తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సహకార పరపతి సొసైటీ తమ సభ్యుల కుటుంబాలకు బలమైన ఆర్థిక భరోసానిచ్చే దిశగా మరొక విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సొసైటీ సభ్యులకు రూ. 15 లక్షల జీవిత బీమా (లోన్ ఇన్సూరెన్స్) పథకాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు శ్రీ రేండ్ల రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు.సచివాలయం, శాసనసభ (అసెంబ్లీ) మరియు లోక్ భవన్ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సేవలందిస్తున్న ఈ సొసైటీ, మే 2025లో నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోంది.

ఇన్సూరెన్స్ పథకం వివరాలు:

**పాత పద్ధతికి స్వస్తి:**

గతంలో ఉన్న పాలకవర్గం నెలకు రూ. 800 ప్రీమియం వసూలు చేస్తూ కేవలం రూ. 2 లక్షల బీమా మాత్రమే అందించేది. దీనివల్ల సభ్యులపై తీవ్ర ఆర్థిక భారం పడేది.

**చారిత్రాత్మక మార్పు:**

నూతన పాలకవర్గం తీవ్రంగా శ్రమించి, వివిధ సంఘాలతో చర్చలు జరిపి సభ్యులకు గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా రూపకల్పన చేసింది. పాత ప్రీమియంపై కేవలం రూ. 200 మాత్రమే పెంచి, నెలకు రూ. 1,000 ప్రీమియంతో ఏకంగా రూ. 15 లక్షల ఇన్సూరెన్స్ వర్తించేలా చర్యలు తీసుకుంది.

**రెండు కేటగిరీలు:**

రుణగ్రహీతలకు: రూ. 1,000 నెలసరి ప్రీమియంతో రూ. 15 లక్షల బీమా (తప్పనిసరి).

**రుణం లేని సభ్యులకు:**

కేవలం రూ. 200 నెలసరి ప్రీమియంతో రూ. 2 లక్షల జీవిత బీమా.

**సొసైటీ సాధించిన ఇతర పురోగతులు:**

ఉద్యోగుల రుణ పరిమితిని పెంచడంతో పాటు రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించడమైంది. పొదుపును ప్రోత్సహించేందుకు ఫిక్స్డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు పెంచడం జరిగింది. అంతేకాకుండా, ఎస్ఆర్డీఎస్ (SRDS) రికరింగ్ డిపాజిట్ పథకం ద్వారా ప్రతి నెలా రూ. 500 నుండి రూ. 20,000 వరకు 8% వార్షిక వడ్డీ రేటుతో పొదుపు చేసుకునే సదుపాయం కల్పించగా, ఇప్పటికే 200 మందికి పైగా సభ్యులు ఇందులో భాగస్వాములయ్యారు.

సచివాలయం, అసెంబ్లీ, లోక్ భవన్‌లలో ఇంకా సభ్యత్వం తీసుకోని ఉద్యోగులందరూ త్వరగా సొసైటీలో చేరి ఈ ఆర్థిక ప్రయోజనాలను, భద్రతను పొందాలని సొసైటీ అధ్యక్షులు శ్రీ రేండ్ల రాజేష్ మరియు పాలకవర్గ సభ్యులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



# మచ్చ వేణుగోపాల్ రెడ్డికి మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ అనిల్ కూర్మాచలం పరామర్శ

**సిద్ధిపేట, వెలుతురు, ఆగస్టు 12:**





బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి మాతృమూర్తి జయమ్మ మృతి పట్ల ఎన్నారై బిఆర్ఎస్ వ్యవస్థాపకుడు, మాజీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) చైర్మన్ అనిల్ కూర్మాచలం తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జయమ్మ మృతి చెందిన వార్త తెలుసుకున్న ఆయన సిద్దిపేటలోని వేణుగోపాల్ రెడ్డి నివాసానికి వెళ్లి జయమ్మ భౌతికకాయాన్ని దర్శించుకుని పూలమాల వేసి నివాళులర్పించారు.మాతృవియోగంతో తీవ్ర విషాదంలో ఉన్న వేణుగోపాల్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులందరూ మనోధైర్యంతో ఉండాలని ఆకాంక్షించారు. జయమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువ నాయకుడు తిరుమందాస్ నరేష్ గౌడ్, ఏఎస్ఆర్, సంతోష్ పాల్గొని తమ సానుభూతిని తెలియజేశారు.

# కోదండరాంను అడ్డుకున్న నిరుద్యోగులు..

- **ఒక్కసారిగా చుట్టుముట్టిన నిరుద్యోగ యువత**
- **తమ సమస్యలపై నిలదీసిన నిరుద్యోగులు**

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 12:**

ఎమ్మెల్సీ, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను నిరుద్యోగుల నిరసన సెగ తాకింది. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల వయోపరిమితి పెంపు అంశంపై మాట్లాడేందుకు వచ్చిన ఆయనను నిరుద్యోగ యువత అడ్డుకుని నిలదీశారు. పెద్ద సంఖ్యలో యువత ఒక్కసారిగా చుట్టుముట్టడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

**"60 ఏళ్లకు ఎమ్మెల్సీ.. మాకు ఉద్యోగం వద్దా?"**

ఈ సందర్భంగా నిరుద్యోగులు కోదండరాంను తీవ్రంగా ప్రశ్నించారు. "మీరు 60 ఏళ్ల వయసులో కూడా సుప్రీంకోర్టు వరకు వెళ్లి ఎమ్మెల్సీ పదవి సాధించుకోవచ్చు.. కానీ మేం 30 ఏళ్ల వయసులో అన్ని అర్హతలు ఉన్నా ప్రభుత్వ ఉద్యోగం చేయడానికి పనికిరామా?'' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే వయోపరిమితి విషయంలో తమ పరిస్థితిని ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరారు. ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న తమకు వయోపరిమితి దాటిపోవడం మరో సమస్యగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఎన్నికల హామీలను గుర్తుచేసిన యువత**

అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిరుద్యోగుల సమస్యలపై ఇచ్చిన హామీలను యువత ఈ సందర్భంగా గుర్తుచేసింది. అప్పట్లో మీరు చెప్పిన మాటలను నమ్మి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశామని, ఇప్పుడు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తమ సమస్యలపై ఎందుకు మాట్లాడటం లేదని కోదండరాంను ప్రశ్నించారు.ఉద్యోగ నోటిఫికేషన్లు, వయోపరిమితి పెంపు వంటి అంశాల్లో తక్షణ నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు.

**"మా బాధ ఎవరికీ కనిపించడం లేదు"**

ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం చదువుతూ, పరీక్షలకు సిద్ధమవుతూ మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని పలువురు నిరుద్యోగులు కన్నీటి పర్యంతమయ్యారు. తమ సమస్యలను ప్రభుత్వం మాత్రమే కాకుండా మీడియా కూడా సరిగ్గా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా నిరుద్యోగుల వయోపరిమితి పెంపు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోదండరాంను కోరారు. తమకు న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

# రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా సాగునీటి ప్రణాళిక

- **ఎల్ లినో ప్రభావం - ఆరుతడి పంటలే మేలు: మంత్రి జూపల్లి**
- **గత బీఆర్ఎస్ పాలకుల నిర్లక్ష్యంతోనే తెలంగాణకు నీటి అన్యాయం: జూపల్లి**
- **పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై బీఆర్ఎస్‌ది మాటల గారడీ**

**వనపర్తి, వెలుతురు ఆగస్టు 12:**



ప్రస్తుత పరిస్థితుల్లో రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టుల కింద ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. వనపర్తి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో బుధవారం ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి పారుదల సలహా మండలి సమావేశం నిర్వహించారు. సమావేశానికి పశుసంవర్ధక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, సాగునీటి పారుదల శాఖ అధికారులు హాజరయ్యారు. సమావేశంలో జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిలాసాగర్, ఆర్డీఎస్, కల్వకుర్తి తదితర ప్రాజెక్టుల జలాశయాల్లో నీటి లభ్యత, నీటి విడుదల, పంటల సాగు తదితర అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. అయితే కర్ణాటక, మహారాష్ట్రల్లో వర్షాలు కురవడంతో జూరాలకు కొంతమేర నీరు వచ్చిందని, ఫలితంగా శ్రీశైలం ప్రాజెక్టులోనూ నీటి నిల్వలు పెరిగాయని చెప్పారు.

ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు డిసెంబరు వరకు నీటిని అందించాల్సి ఉందన్నారు. మళ్లీ వర్షాలు కురిస్తే తప్ప ఖరీఫ్ సీజన్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు అందించే పరిస్థితి లేదని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాగునీటి శాఖ అధికారులు ఇచ్చిన నివేదికను పరిశీలించి రైతుల శ్రేయస్సు దృష్ట్యా ఆరుతడి పంటలు సాగు చేసుకోవడం మంచిదని సూచించారు.బోర్లు, బావులపై ఆధారపడే రైతులు కొంతమేర వరి సాగు చేసినా పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చని, అయితే ప్రాజెక్టు కాలువల ద్వారా సాగు చేసే రైతులు మాత్రం ఆరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు.జూరాల ప్రాజెక్టులో ప్రస్తుతం సుమారు 9 టీఎంసీల నీరు మాత్రమే ఉందని మంత్రి తెలిపారు. ఇందులో 7 టీఎంసీలను సాగునీటి అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉండగా, మరో 2 టీఎంసీలను తాగునీటి అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉందన్నారు.శ్రీశైలం ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ నాగార్జునసాగర్‌తో పాటు ఇతర ప్రాజెక్టులకు కూడా నీటిని విడుదల చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో రైతులు పరిస్థితిని అర్థం చేసుకుని ఆరుతడి పంటలు సాగు చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పటికీ తెలంగాణకు నికర జలాల కేటాయింపులు సాధించలేదని మంత్రి జూపల్లి విమర్శించారు. రూ.70 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టుకు రూ.20 వేల కోట్లు ఖర్చు చేసి, ప్రాజెక్టు పూర్తయిందంటూ జాతికి అంకితం చేసినట్లు ప్రకటించి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు.తెలంగాణకు ఉన్న నీటి హక్కులను సైతం ఆంధ్రప్రదేశ్‌కు అప్పనంగా అప్పగించారని విమర్శించారు. 68.5:31.5 నిష్పత్తిలో 811 టీఎంసీల కృష్ణా జలాల్లో తెలంగాణకు 512 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 299 టీఎంసీలు రావాల్సి ఉండగా.. గత ప్రభుత్వం తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాను సరిగా వినియోగించుకోలేకపోయిందని ఆరోపించారు.ఎవరు ఎవరికి అన్యాయం చేశారో ప్రజలకు తెలుసని అన్నారు. ఇప్పుడు రైతులపై మొసలి కన్నీరు కారుస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు.పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ఖుర్చీ వేసుకుని రెండేళ్లలో పూర్తి చేసి తీరుతామని అప్పట్లో చెప్పిన కేసీఆర్.. 2014 నుంచి 2022 వరకు ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను కూడా సమర్పించలేదని మంత్రి జూపల్లి తెలిపారు.ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు రూపకల్పన చేసి, వాటికి శ్రీకారం చుట్టింది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ.8,300 కోట్లు నిధులు వెచ్చించిందన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ.6 వేల కోట్లు ఖర్చు చేసి మొత్తం ప్రాజెక్టులను తామే పూర్తి చేశామని చెప్పుకోవడం వాస్తవాలను వక్రీకరించడమేనని మంత్రి జూపల్లి అన్నారు. రైతులకు వాస్తవాలు తెలియజేసి, సాగునీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగుపై సూచనలు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# పార్లమెంట్‌ను అడ్డుకుంటున్న విపక్షాలు నితిన్ నబిన్ తీవ్ర విమర్శలు

- **విపక్షాల తీరు 'అరాచక మనస్తత్వానికి' నిదర్శనమని వ్యాఖ్య**
- **చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న నితిన్ నబిన్**
- **ప్రతిపక్షాల వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని వెల్లడి**
- **సభను సజావుగా నిర్వహించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సూచన**
- **కీలక అంశాలపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని బీజేపీ అభిప్రాయం**
- **విపక్షాలు ఆందోళనలకే పరిమితమవుతున్నాయని ఆరోపణ**
- **అమిత్‌షా సైతం ప్రతిపక్షాలకు చర్చకు రావాలని పిలుపు**
- **అధికార, విపక్షాల మధ్య మరింత ముదిరిన రాజకీయ వివాదం**

**న్యూఢిల్లీ, వెలుతురు, ఆగస్టు 12:**

పార్లమెంట్ సమావేశాలను వరుసగా అడ్డుకుంటూ, కీలకమైన ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా విపక్షాలు వ్యవహరిస్తున్నాయని అధికార భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్రస్థాయిలో మండిపడింది. ప్రతిపక్షాల ఈ ధోరణి వారి 'అరాచక మనస్తత్వాన్ని' ప్రతిబింబిస్తోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఆరోపించారు.సామాజిక మాధ్యమాల వేదికగా నితిన్ నబిన్ ప్రతిపక్షాల తీరుపై స్పందించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రతి ముఖ్యమైన అంశంపై పార్లమెంట్‌లో చర్చించేందుకు సిద్ధంగా ఉందని, అయినప్పటికీ విపక్షాలు సభా కార్యకలాపాలను అడ్డుకుంటున్నాయని విమర్శించారు.ప్రజలకు సంబంధించిన కీలక సమస్యలపై చర్చ జరగాల్సిన పార్లమెంట్‌లో నిరసనలు, ఆందోళనలతో కార్యకలాపాలకు ఆటంకం కలిగించడం సరికాదని ఆయన అన్నారు. ప్రజలు ఈ పరిణామాలను గమనిస్తున్నారని, చర్చల నుంచి ఎవరు దూరంగా ఉంటున్నారో దేశ ప్రజలకు స్పష్టంగా అర్థమవుతోందని పేర్కొన్నారు.

**అమిత్‌షా సైతం సవాల్**

మరోవైపు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా విపక్షాల వైఖరిని తప్పుబట్టారు. పార్లమెంట్‌లో ఏ అంశంపైనైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రతిపక్షాలకు చర్చపై నిజంగా ఆసక్తి ఉంటే లోక్‌సభ స్పీకర్‌కు లేఖ ఇవ్వాలని సూచించారు.బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు నిరంతరాయంగా చర్చ జరిపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అమిత్‌షా పేర్కొన్నట్లు సమాచారం. దీంతో సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందనే సంకేతాన్ని ఇచ్చారు.

**వాయిదాల పర్వం**

గత కొన్ని రోజులుగా పార్లమెంట్ ఉభయ సభల్లో కార్యకలాపాలు సజావుగా సాగడం లేదు. వివిధ అంశాలపై చర్చకు ప్రతిపక్షాలు పట్టుబడుతూ నిరసనలకు దిగుతున్నాయి. మరోవైపు పార్లమెంటరీ నిబంధనలకు అనుగుణంగా చర్చల్లో పాల్గొనాలని అధికార పక్షం సూచిస్తోంది.దీంతో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. సభా కార్యకలాపాలను అడ్డుకోవడంపై అధికార పక్షం విమర్శలు చేస్తుండగా, తమకు సంబంధించిన కీలక అంశాలపై ప్రభుత్వం చర్చకు రావడం లేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.పార్లమెంట్ సమావేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇరు పక్షాల మధ్య వివాదం మరింత ముదిరే అవకాశం కనిపిస్తోంది. సభ సజావుగా సాగి ప్రజా సమస్యలపై చర్చ జరగాలంటే అధికార, ప్రతిపక్షాలు పరస్పర సహకారంతో ముందుకు రావాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మైనారిటీ టాపర్ల సన్మాన కార్యక్రమం ఏర్పాట్లపై మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ సమీక్ష

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 12, 2026:**



తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ వెల్ఫేర్ & పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ మంత్రి శ్రీ మహమ్మద్ అజహరుద్దీన్ బుధవారం తెలంగాణ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆగస్టు 13న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నిర్వహించనున్న మైనారిటీ ప్రతిభావంతుల విద్యార్థుల సన్మాన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను మంత్రి సమీక్షించారు.

ఈ కార్యక్రమంలో గ్రూప్–I, గ్రూప్–II, IIT–JEE, EAPCETతో పాటు ఇతర పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన మైనారిటీ విద్యార్థులను, అలాగే తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (TGMREIS) పరిధిలో SSC, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించనున్నారు.

సమావేశంలో మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ సంబంధిత ఉన్నతాధికారులతో కార్యక్రమ ఏర్పాట్లను సమగ్రంగా సమీక్షించారు. విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు మరియు కార్యక్రమానికి హాజరయ్యే అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను సమన్వయంతో, పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మైనారిటీ విద్యార్థుల్లో విద్యా ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడం ఎంతో ముఖ్యమని మంత్రి అన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థుల విజయాలు మరింత మంది యువతకు స్ఫూర్తిగా నిలిచి, ఉన్నత విద్యతో పాటు పోటీ పరీక్షల్లో విజయాలు సాధించే దిశగా వారిని ప్రోత్సహిస్తాయని పేర్కొన్నారు.

కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల మధ్య సమన్వయం అత్యంత అవసరమని మంత్రి స్పష్టం చేశారు. భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు, అగ్నిమాపక భద్రత, పౌర సదుపాయాలు మరియు ఇతర లాజిస్టిక్స్ ఏర్పాట్లను సమగ్రంగా చేపట్టాలని అధికారులకు సూచించారు.

ఈ సమీక్షా సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ గౌరవ సలహాదారు శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్, TGMREIS అధ్యక్షులు శ్రీ ఫహీమ్ ఖురేషీ, మైనారిటీస్ వెల్ఫేర్ శాఖ కార్యదర్శి శ్రీ బి. షఫీఉల్లా, IFS, ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ అహ్మద్ నదీమ్తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పాల్గొన్న అధికారులు / శాఖలు

1. హైదరాబాద్ జిల్లా కలెక్టర్
2. హైదరాబాద్ పోలీస్ కమిషనర్
3. అదనపు పోలీస్ కమిషనర్, ట్రాఫిక్
4. కమిషనర్, GHMC
5. డైరెక్టర్ జనరల్, తెలంగాణ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ & ఫైర్ సర్వీసెస్, హైదరాబాద్
6. కమిషనర్, హార్టికల్చర్ శాఖ
7. కమిషనర్, సమాచార & పౌర సంబంధాల శాఖ (I&PR)
8. చీఫ్ ఇంజనీర్ & మేనేజింగ్ డైరెక్టర్, ట్రాన్స్‌కో
9. మేనేజింగ్ డైరెక్టర్, HMWSSB
10. జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి (DMHO), హైదరాబాద్

వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారుల భాగస్వామ్యం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న సమగ్ర చర్యలకు నిదర్శనంగా నిలుస్తోంది.

మైనారిటీ విద్యార్థుల విద్యా ప్రతిభ, ప్రతిభాపాటవాలు మరియు భవిష్యత్తు ఆకాంక్షలను ప్రోత్సహించే ఒక గొప్ప వేడుకగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మైనారిటీస్ వెల్ఫేర్ శాఖ అన్ని అవసరమైన చర్యలు చేపడుతోంది.

# శ్రావణ మాసం ఆధ్యాత్మిక చైతన్యానికి, భక్తి భావనకు ప్రతీక

- శివారాధనతో పాటు లక్ష్మీదేవి, పార్వతీదేవి, విష్ణుమూర్తి, గణపతి తదితర దేవతలను భక్తిశ్రద్ధలతో ఆరాధించాలి
- ప్రజలందరికీ శ్రావణ మాస శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 12, 2026:**

సనాతన ధర్మంలో అత్యంత పవిత్రమైన మాసాలలో ఒకటైన శ్రావణ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ రాష్ట్ర ప్రజలకు శ్రావణ మాస శుభాకాంక్షలు తెలిపారు.శ్రావణ మాసం భక్తి, ఆధ్యాత్మికత, నియమం, దానం, ధర్మం, పూజలు, వ్రతాలకు విశిష్టమైన కాలమని ఆయన పేర్కొన్నారు. ఈ పవిత్ర మాసంలో ప్రతి కుటుంబం భక్తిశ్రద్ధలతో దేవతలను ఆరాధిస్తూ, సాత్విక జీవన విధానాన్ని పాటిస్తూ, మానవతా విలువలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.ప్రాంతీయ పంచాంగ సంప్రదాయాల ఆధారంగా శ్రావణ మాస ప్రారంభ తేదీలో తేడాలు ఉంటాయని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి పద్ధతిని అనుసరించే ప్రాంతాల్లో 2026లో శ్రావణ మాసం ఆగస్టు 13న ప్రారంభమై సెప్టెంబర్ 11 వరకు కొనసాగుతుంది.

## శ్రావణ మాసానికి ఉన్న ప్రత్యేకత

శ్రావణ మాసం ప్రకృతి పరంగా వర్షాకాలంతో, ఆధ్యాత్మికంగా భక్తి భావనతో ముడిపడి ఉన్న పవిత్రమైన కాలమని పి. ప్రసన్న కుమార్ శర్మ అన్నారు. ఈ మాసంలో దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వ్రతాలు, పారాయణాలు నిర్వహించడం అనాదిగా వస్తున్న సంప్రదాయమని తెలిపారు.శ్రావణ మాసంలో "ఓం నమః శివాయ" అనే పంచాక్షరీ మంత్రాన్ని జపిస్తూ పరమశివుడిని ఆరాధించడం అత్యంత విశిష్టమైన ఆధ్యాత్మిక సాధనగా భావిస్తారని అన్నారు.

ముఖ్యంగా శ్రావణ సోమవారాల్లో శివలింగానికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వదళ సమర్పణ, రుద్రాభిషేకం వంటి పూజలు నిర్వహించడం ద్వారా మనస్సుకు ప్రశాంతత, ఆధ్యాత్మిక చైతన్యం లభిస్తాయని భక్తుల విశ్వాసమని తెలిపారు.అయితే దేవుడిని ఆరాధించడం కేవలం కోరికల సాధన కోసమే కాకుండా, మనలోని అహంకారాన్ని తగ్గించుకోవడానికి, మంచి ఆలోచనలను పెంపొందించుకోవడానికి, ఇతరుల పట్ల దయ, కరుణ, సేవాభావాన్ని పెంచుకోవడానికి ఉపయోగపడాలని ఆయన సూచించారు.

## శివారాధన – ఆత్మశాంతికి మార్గం

శ్రావణ మాసంలో పరమశివుడి ఆరాధనకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని పి. ప్రసన్న కుమార్ శర్మ తెలిపారు. శివలింగానికి పవిత్ర జలంతో అభిషేకం చేసి, బిల్వదళాలు సమర్పిస్తూ శివపంచాక్షరీ మంత్రాన్ని జపించడం ద్వారా భక్తి, ఏకాగ్రత పెంపొందుతాయని పేర్కొన్నారు.శివుడు త్యాగానికి, సహనానికి, సమత్వానికి ప్రతీక అని ఆయన అన్నారు. సముద్ర మథనంలో వెలువడిన హాలాహలాన్ని లోకరక్షణ కోసం స్వీకరించిన నీలకంఠుడి కథ మనకు త్యాగం, బాధ్యత, సమాజ శ్రేయస్సు అనే గొప్ప సందేశాలను అందిస్తుందని తెలిపారు.

## పార్వతీదేవి – కుటుంబ సౌభాగ్యానికి ప్రతీక

శ్రావణ మాసంలో పార్వతీదేవిని ఆరాధించడం కూడా ఎంతో విశిష్టమైనదని ఆయన అన్నారు. ముఖ్యంగా మంగళగౌరీ వ్రతం ద్వారా మహిళలు గౌరీదేవిని భక్తిశ్రద్ధలతో పూజించడం అనాదిగా వస్తున్న సంప్రదాయమని తెలిపారు.గౌరీదేవి ఆరాధనను కుటుంబ సౌఖ్యం, దాంపత్య శాంతి,



సౌభాగ్యం, ఆరోగ్యం, కుటుంబ ఐక్యత కోసం చేసే ప్రార్థనగా భక్తులు విశ్వసిస్తారని పేర్కొన్నారు.

## మహాలక్ష్మీ ఆరాధన – సంపదతో పాటు సంతృప్తి

శ్రావణ మాసంలో లక్ష్మీదేవి ఆరాధనకు ప్రత్యేక స్థానం ఉందని పి. ప్రసన్న కుమార్ శర్మ అన్నారు. ముఖ్యంగా శ్రావణ శుక్రవారాల్లో లక్ష్మీదేవిని పూజించడం, దీపారాధన చేయడం, వ్రతాలు నిర్వహించడం ద్వారా ఆర్థిక సౌభాగ్యం, కుటుంబ శ్రేయస్సు, ధాన్యసంపద, సుఖశాంతులు కలుగుతాయని భక్తుల విశ్వాసమని తెలిపారు.అయితే సంపద అంటే కేవలం డబ్బు మాత్రమే కాదని, ఆరోగ్యం, జ్ఞానం, మంచి కుటుంబ సంబంధాలు, సంతృప్తి, ధర్మబద్ధమైన జీవనం కూడా నిజమైన సంపదేనని ఆయన పేర్కొన్నారు.

## వరలక్ష్మీ వ్రతం – మహిళల భక్తికి ప్రతీక

శ్రావణ మాసంలోని అత్యంత ప్రాధాన్యత కలిగిన పర్వదినాల్లో వరలక్ష్మీ వ్రతం ఒకటని ఆయన తెలిపారు

వరలక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో పూజించడం ద్వారా కుటుంబానికి ఆరోగ్యం, ఐశ్వర్యం, సౌభాగ్యం, సంతానం, శాంతి, సుఖసంతోషాలు కలుగుతాయని సంప్రదాయ విశ్వాసమని తెలిపారు.

ఈ సందర్భంగా మహిళలు కుటుంబ సంక్షేమం కోసం నిర్వహించే వ్రతాలు భారతీయ కుటుంబ వ్యవస్థలోని ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలను ప్రతిబింబిస్తాయని అన్నారు.

## విష్ణుమూర్తి ఆరాధన – ధర్మం, జ్ఞానం, శాంతి

శ్రావణ మాసంలో శ్రీమహావిష్ణువును ఆరాధించడం కూడా ఎంతో విశిష్టమైనదని పి. ప్రసన్న కుమార్ శర్మ అన్నారు. విష్ణుమూర్తి ధర్మ పరిరక్షణకు ప్రతీక అని, ఆయన ఆరాధన ద్వారా మనస్సుకు ప్రశాంతత, ధర్మబద్ధమైన ఆలోచన, కుటుంబ శ్రేయస్సు కలగాలని భక్తులు ప్రార్థిస్తారని తెలిపారు.

శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఉపాకర్మ వంటి వేద సంప్రదాయాలకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. 2026లో శ్రావణ పౌర్ణమి ఆగస్టు 28న ఉంది. (Drik Panchang)

## గణపతి ఆరాధన – విఘ్నాల నివారణకు ప్రార్థన

ఏ శుభకార్యానికైనా ముందుగా గణపతిని పూజించడం భారతీయ సంప్రదాయంలో భాగమని ఆయన అన్నారు. శ్రావణ మాసంలో గణపతిని ఆరాధిస్తూ "ఓం గం గణపతయే నమః" మంత్రాన్ని జపించడం ద్వారా విఘ్నాలు తొలగి, జ్ఞానం, వివేకం, కార్యసిద్ధి కలగాలని భక్తులు ప్రార్థిస్తారని తెలిపారు.

## నాగపంచమి – ప్రకృతి, జీవజాల పరిరక్షణకు సందేశం

శ్రావణ శుక్ల పంచమి రోజున జరుపుకునే నాగపంచమి పర్వదినానికి కూడా ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉందని పి. ప్రసన్న కుమార్ శర్మ తెలిపారు. 2026లో నాగపంచమి శ్రావణ శుక్ల పంచమి రోజున వస్తుందని పంచాంగ సమాచారం పేర్కొం

నాగదేవతలను పూజించే సంప్రదాయం ద్వారా ప్రకృతిలోని ప్రతి జీవికి గౌరవం ఇవ్వాలనే సందేశం కూడా మనకు లభిస్తుందని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

## శ్రావణ మాసం – దానం, సేవ, మానవతకు కూడా సమయం

శ్రావణ మాసంలో పూజలు, వ్రతాలతో పాటు అన్నదానం, వస్త్రదానం, విద్యార్థులకు సహాయం, నిరుపేదలకు అండగా నిలవడం, వృద్ధులను ఆదుకోవడం, గోసేవ, పర్యావరణ పరిరక్షణ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పి. ప్రసన్న కుమార్ శర్మ పిలుపునిచ్చారు.

దేవుడికి సమర్పించే పుష్పం కంటే ఆకలితో ఉన్న మనిషికి అందించే అన్నం గొప్పదని, ఆలయంలో వెలిగించే దీపంతో పాటు నిరాశలో ఉన్న వ్యక్తి జీవితంలో ఆశాదీపం వెలిగించడం నిజమైన మానవత్వమని అన్నారు.

## భక్తి మనసులో ఉండాలి – సేవ చేతల్లో కనిపించాలి అని ఆయన పేర్కొన్నారు

## శ్రావణ సోమవారాలు – శివభక్తికి ప్రత్యేక దినాలు

శ్రావణ మాసంలోని ప్రతి సోమవారం శివభక్తులకు ఎంతో పవిత్రమైన రోజుగా భావిస్తారని ఆయన తెలిపారు. ఉపవాసం, అభిషేకం, రుద్రపారాయణం, శివనామస్మరణ, దేవాలయ దర్శనం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తుల ఆచారాల్లో భాగమని అన్నారు.

2026లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి ప్రాంతాల్లో శ్రావణ మాసం ఆగస్టు 13 నుంచి ప్రారంభమయ్యే పద్ధతి ప్రకారం శ్రావణ సోమవారాల తేదీలు స్థానిక పంచాంగాన్ని అనుసరించి పాటించాలని సూచించారు. ప్రాంతానుసారంగా పండుగల తేదీల్లో తేడాలు ఉండవచ్చని తెలిపారు.

## శ్రావణ మాసంలో పాటించాల్సిన మంచి ఆచారాలు

ఈ పవిత్ర మాసంలో ప్రతి ఒక్కరూ తమ శక్తి మేరకు కొన్ని మంచి నియమాలను పాటించాలని పి. ప్రసన్న కుమార్ శర్మ సూచించారు.

- ప్రతిరోజూ ఉదయం భగవంతుడిని స్మరించడం.
- శివాలయం లేదా తమ ఇష్టదైవ ఆలయాన్ని దర్శించడం.
- సాధ్యమైనంత వరకు సాత్విక ఆహారం తీసుకోవడం.
- ఉపవాసాలు ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా మాత్రమే చేయడం.
- తల్లిదండ్రులు, పెద్దలను గౌరవించడం.
- అన్నదానం, వస్త్రదానం వంటి సేవా కార్యక్రమాలు చేయడం.
- పేద విద్యార్థులకు విద్యా సహాయం అందించడం.
- మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించడం.
- కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థనలు, పారాయణాలు నిర్వహించడం.
- కోపం, ద్వేషం, అసూయ, అహంకారాన్ని తగ్గించుకోవడానికి ప్రయత్నించడం.

## ఆధ్యాత్మికతతో పాటు సామాజిక బాధ్యత

శ్రావణ మాసం మనకు కేవలం పూజలు, వ్రతాలు మాత్రమే నేర్పదని, సమాజం పట్ల బాధ్యత, ప్రకృతి పట్ల గౌరవం, పేదల పట్ల కరుణ, కుటుంబం పట్ల ప్రేమ, సమాజం పట్ల సేవాభావం వంటి విలువలను కూడా గుర్తు చేస్తుందని పి. ప్రసన్న కుమార్ శర్మ అన్నారు.

భిన్న దేవతలను ఆరాధించే సంప్రదాయాలు ఉన్నప్పటికీ వాటి అంతరార్థం ఒక్కటేనని, ధర్మం, సత్యం, దయ, శాంతి, సేవ, సౌభ్రాతృత్వం అనే విలువలను జీవితంలో ఆచరించడమే నిజమైన ఆధ్యాత్మికత అని పేర్కొన్నారు.

శ్రావణ మాసంలో ప్రతి ఇంటా భక్తి భావన వెల్లివిరియాలని, ప్రతి కుటుంబంలో ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆనందం, సుఖశాంతులు నెలకొనాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, తెలంగాణతో పాటు దేశ ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆయన భగవంతుడిని ప్రార్థించారు.

"శ్రావణ మాసం ప్రతి కుటుంబానికి ఆధ్యాత్మిక శక్తిని, మానసిక ప్రశాంతతను, ఆరోగ్యాన్ని, ఐశ్వర్యాన్ని అందించాలి. భక్తితో పాటు మానవత్వం, సేవాభావం, సోదరభావం ప్రతి ఒక్కరిలో మరింత పెరగాలి" అని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ ఆకాంక్షించారు.

రాష్ట్ర ప్రజలందరికీ శ్రావణ మాస శుభాకాంక్షలు



పి. ప్రసన్న కుమార్ శర్మ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)

# తెలంగాణ జైళ్ల చరిత్రలో తొలిసారి NIOS ద్వారా 78 మంది ఖైదీలకు SSC ఉత్తీర్ణత

- ప్రత్యేక రిమిషన్ ప్రకటించిన జైళ్ల శాఖ డీజీ డా. సౌమ్య మిశ్రా

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 12:**

ఖైదీల విద్య, పునరావాసం మరియు సమాజంలో తిరిగి గౌరవప్రదంగా జీవించేలా చేయడంలో భాగంగా తెలంగాణ జైళ్ల శాఖ చేపడుతున్న నిరంతర కార్యక్రమాల్లో మరో కీలక ముందడుగు పడింది. ఖైదీలు తమ విద్యను కొనసాగించి SSC పూర్తి చేసుకునే అవకాశం కల్పించేందుకు తెలంగాణ జైళ్ల శాఖ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (NIOS) తో అవగాహన ఒప్పందం (MoU) కుదుర్చుకుంది.

ఈ MoU అనంతరం సెంట్రల్ ప్రిజన్, చర్లపల్లి; సెంట్రల్ ప్రిజన్, నిజామాబాద్; స్పెషల్ ప్రిజన్ ఫర్ ఉమెన్, హైదరాబాద్ నుంచి మొత్తం 108 మంది ఖైదీలు SSC (10వ తరగతి) కార్యక్రమంలో నమోదు చేసుకున్నారు. ఖైదీల చదువుకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులను కేటాయించడంతో పాటు, అవసరమైన చోట అదనంగా ప్రైవేట్ ఉపాధ్యాయులను కూడా నియమించారు. వీరి వేతనాలను తెలంగాణ జైళ్ల శాఖ భరించింది.

సంబంధిత జైళ్లలోని అధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థుల చదువును నిరంతరం పర్యవేక్షిస్తూ, మార్గనిర్దేశం చేశారు. ఒక సంవత్సరం పాటు క్రమబద్ధమైన విద్యా ప్రణాళికలో భాగంగా రెగ్యులర్ తరగతులు, మాక్ టెస్టులు, ప్రీ–బోర్డ్ పరీక్షలు నిర్వహించి NIOS SSC పరీక్షలకు ఖైదీలను సిద్ధం చేశారు.

ఈ నిరంతర కృషి ఫలితంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో 78 మంది ఖైదీలు SSC పరీక్షలో విజయవంతంగా ఉత్తీర్ణత సాధించారు.

- సెంట్రల్ ప్రిజన్, చర్లపల్లి – 56 మంది
- సెంట్రల్ ప్రిజన్, నిజామాబాద్ – 15 మంది
- స్పెషల్ ప్రిజన్ ఫర్ ఉమెన్, హైదరాబాద్ – 7 మంది

ఖైదీలకు సులభంగా అర్థమయ్యేలా, భవిష్యత్తులో ఉపాధి మరియు జీవనోపాధికి ఉపయోగపడే విధంగా పాఠ్యాంశాలను ఎంపిక చేశారు. ఇందులో డేటా ఎంట్రీ ఆపరేటర్ (DEO) నైపుణ్యాలకు సంబంధించిన అంశాలను కూడా చేర్చారు.

తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ & కరెక్షనల్ సర్వీసెస్ డా. సౌమ్య మిశ్రా, IPS, విజయవంతంగా SSC ఉత్తీర్ణత సాధించిన ఖైదీలకు ధ్రువపత్రాలను అందజేసి వారిని అభినందించారు. ఈ ఫలితాలను వారి విద్యా ప్రయాణం, స్వీయాభివృద్ధి మరియు పునరావాసంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా ఆమె అభివర్ణించారు.

ఖైదీలు చూపిన పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర శ్రమ, ఆత్మవిశ్వాసం మరియు ప్రతికూల పరిస్థితులను అధిగమించాలనే సంకల్పాన్ని డీజీ ప్రత్యేకంగా ప్రశంసించారు. తమ జీవితాల్లో సానుకూల







మార్పు తీసుకురావాలనే దృఢ సంకల్పానికి ఈ విజయం నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఇదే పట్టుదలతో భవిష్యత్తులో కూడా విద్యను కొనసాగిస్తూ, తమకు మరియు తమ కుటుంబాలకు గౌరవప్రదమైన, మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆమె సూచించారు.

ఈ సందర్భంగా పలువురు ఖైదీలు తమ అనుభవాలను పంచుకున్నారు. విద్య లేకపోవడం వల్ల తమ జీవితాల్లో ఎదురైన ఇబ్బందులను వారు వివరించారు. చదువు లేకపోవడం కారణంగా ఆత్మవిశ్వాసం తగ్గిపోయిందని, సమాజంలో తగిన గౌరవం లభించలేదని కొందరు తెలిపారు. ఒక ఖైదీ భవిష్యత్తులో LL.B. వరకు చదివి న్యాయవాదిగా మారి, పేద ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందించాలనే తన సంకల్పాన్ని వ్యక్తం చేశారు. మరో ఖైదీ తన చిన్ననాటి నుంచే సరైన విద్య అందించి ఉంటే తన జీవితం మరోలా ఉండేదని, బహుశా తాను జైలుకు వచ్చే పరిస్థితి ఏర్పడి ఉండకపోయేదని ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణలోని జైలు ఖైదీలకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడంలో సహకరిస్తున్న నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (NIOS) కు డా. సౌమ్య మిశ్రా కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా మాజీ NIOS రీజినల్ డైరెక్టర్ శ్రీ పరంప్రీత్ సింగ్, NIOS రీజినల్ డైరెక్టర్ డా. ప్రవీణ్ చౌహాన్ అందిస్తున్న నిరంతర సహకారాన్ని ఆమె అభినందించారు.విద్యపై ఖైదీలు చూపిన కష్టపడి పనిచేసే తత్వం, క్రమశిక్షణ మరియు నిబద్ధతకు గుర్తింపుగా, NIOS ద్వారా SSC పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన ఖైదీలందరికీ డైరెక్టర్ జనరల్ రిమిషన్ (Director General's Remission) ను ప్రత్యేక ప్రోత్సాహకంగా ప్రకటించారు. విద్య, స్వీయాభివృద్ధి మరియు పునరావాసం దిశగా ముందుకు సాగుతున్న ఇతర ఖైదీలకు కూడా ఇది ప్రేరణగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు.

ఈ విజయంతో ప్రోత్సాహం పొందిన తెలంగాణ జైళ్ల శాఖ, SSC ఉత్తీర్ణులైన ఖైదీలను NIOS ద్వారా సీనియర్ సెకండరీ (10+2) విద్యను కొనసాగించేలా ప్రోత్సహించనుంది. అదే సమయంలో మరో 47 మంది ఖైదీలు తాజాగా SSC విద్యలో నమోదు చేసుకున్నారు. ఇది జైళ్లలో విద్యను కొనసాగించాలనే ఖైదీల ఆసక్తి, పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తోంది. 10+2 పూర్తి చేసిన అనంతరం వారు చర్లపల్లి సెంట్రల్ ప్రిజన్లోని డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ ద్వారా అండర్గ్రాడ్యుయేట్ B.A. కోర్సుల్లో కూడా చేరే అవకాశం ఉంటుంది.

అదనంగా, SSCలో ఉత్తీర్ణత సాధించిన 78 మంది ఖైదీలు చర్లపల్లి సెంట్రల్ ప్రిజన్లో ఏర్పాటు చేసిన ITIలో వివిధ సాంకేతిక, వృత్తి విద్యా కోర్సులు అభ్యసించేందుకు అర్హులు అని డైరెక్టర్ జనరల్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, భవిష్యత్తులో ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకుని స్వయం ఆధారిత జీవితం వైపు అడుగులు వేయాలని ఆమె ప్రోత్సహించారు.

ఖైదీల విద్యా ప్రయాణంలో నిరంతరం వారిని ప్రోత్సహించి, మార్గనిర్దేశం చేసి, అవసరమైన సహకారం అందించిన జైలు అధికారులు, ఉపాధ్యాయులు, సంక్షేమ అధికారులు, విద్యా సమన్వయ కర్తలు మరియు సిబ్బంది కృషిని డైరెక్టర్ జనరల్ ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమానికి శ్రీ పరంప్రీత్ సింగ్, జాయింట్ డైరెక్టర్ ఇన్చార్జ్ (NIOS మీడియా); డా. ప్రవీణ్ చౌహాన్, రీజినల్ డైరెక్టర్, NIOS, హైదరాబాద్; శ్రీ వై. రాజేష్, ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్; డా. డి. శ్రీనివాస్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్, హైదరాబాద్ రేంజ్; శ్రీ ఎం. సంపత్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్, వరంగల్ రేంజ్; శ్రీ జి. ప్రమోద్, సూపరింటెండెంట్, సెంట్రల్ ప్రిజన్, చర్లపల్లి; శ్రీ డి. భారత్, సూపరింటెండెంట్, ప్రిజనర్స్ అగ్రికల్చరల్ కాలనీ; శ్రీమతి లక్ష్మీ శ్రీనాథ్, సూపరింటెండెంట్, SPW హైదరాబాద్; శ్రీ పి. అశోక్ కుమార్, సూపరింటెండెంట్, సెంట్రల్ ప్రిజన్, నిజామాబాద్, ఇతర సీనియర్ జైలు అధికారులు, NIOS ప్రతినిధులు, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు ఖైదీలు పాల్గొన్నారు.

# గ్రామీణ విద్యార్థుల డిజిటల్ విద్యే లక్ష్యం

- **'ఎ డి రెడ్డి మల్టీ స్కిల్ హబ్' అధినేత ఎ. దయాకర్ రెడ్డి**
- **గాజులగూడ ఎంపీపీఎస్ పాఠశాలకు స్మార్ట్ టీవీ, కంప్యూటర్ వితరణ**

**శంకర్ పల్లి, వెలుతురు ఆగస్టు 12 :**



గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ విద్యను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా 'ఎ డి రెడ్డి మల్టీ స్కిల్ హబ్' ముందడుగు వేసింది. ఇందులో భాగంగా గాజులగూడ గ్రామ ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం సంస్థ తరఫున ఒక స్మార్ట్ టీవీ మరియు కంప్యూటర్‌ను ఉచితంగా అందజేశారు.పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు.

**నైపుణ్యాల అభివృద్ధే ప్రధాన ధ్యేయం**

ఈ సందర్భంగా ఎ డి రెడ్డి మల్టీ స్కిల్ హబ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ. దయాకర్ రెడ్డి మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పట్టణ ప్రాంతాలతో సమానంగా ఆధునిక విద్యా సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలన్నదే తమ సంస్థ సంకల్పమన్నారు. కేవలం పాఠశాల విద్యకే పరిమితం కాకుండా, భవిష్యత్తులో ఉపాధి అవకాశాలకు అవసరమైన సాంకేతిక, వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి చేయడం తమ ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.

**యువత, మహిళలకు ఉచిత శిక్షణ**

"స్కిల్ నేర్చుకో – జీవితం మార్చుకో!" అనే నినాదంతో ముందుకు సాగుతున్న ఎ డి రెడ్డి మల్టీ స్కిల్ హబ్.. విద్యార్థులు, యువత మరియు మహిళల స్వయం సమృద్ధి కోసం పలు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోందని నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ, టైలరింగ్ శిక్షణ, మరియు డిప్లొమా నర్సింగ్ శిక్షణ వంటి కోర్సులను అందిస్తున్నట్లు పేర్కొన్నారు.గ్రామీణ విద్యార్థుల విద్యాభివృద్ధికి, యువత ఉపాధికి తమ వంతు సాయంగా ఈ డిజిటల్ పరికరాలను వితరణ చేశామని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని దయాకర్ రెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలకు స్మార్ట్ టీవీ, కంప్యూటర్ అందించినందుకు పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు సంస్థ ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి అనుషా ప్రశాంత్ రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీ నరేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరేశం, ఉపాధ్యాయులు, విజయలక్ష్మి, వీణ (ప్రీ–ప్రైమరీ), ఎన్. వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మల్కం చెరువు ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టడంపై బీఆర్ఎస్ ఆందోళన

## కాంగ్రెస్–బీజేపీ ప్రభుత్వాల తీరుపై మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు తీవ్ర విమర్శలు

**కూకట్ పల్లి ఆగస్టు 12 వెలుతురు:**




గచ్చిబౌలి డివిజన్‌లోని మల్కం చెరువు ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, శంభీపూర్ రాజు, శేరిలింగంపల్లి నియోజకవర్గ సీనియర్ నాయకులు, వందలాది మంది పార్టీ కార్యకర్తలతో కలిసి మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు స్థలాన్ని సందర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడు తూ గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మల్కం చెరువు ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని 'పీఎం ఏక్తా మాల్' నిర్మాణం కోసం కేటాయించినట్లు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల్లో తయారయ్యే స్థానిక ఉత్పత్తులు, చేనేత, హస్తకళలు, సంప్రదాయ కళలకు ఒకే వేదిక కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.200 కోట్లను వడ్డీ రహిత రుణంగా మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. అయితే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఈ స్థలాన్ని ప్రైవేట్ సంస్థలైన అపర్ణ, వంశీరామ్ బిల్డర్స్‌కు తక్కువ శాతం రుసుముతో అప్పగించిందని ఆరోపించారు. ప్రభుత్వ భూమిని ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని ఆయన విమర్శించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వ స్థలం కేటాయింపు, ప్రాజెక్టు మార్పు, కేంద్ర నిధుల వినియోగం తదితర అంశాలపై సీబీఐతో విచారణ జరిపించాలని రంగారావు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సమన్వయంతో ప్రజా ప్రయోజనాలను పక్కనపెట్టి ప్రైవేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చేలా వ్యవహరిస్తున్నాయని ఆయన ఆరోపించారు. చేనేత, హస్తకళలు, సంప్రదాయ కళలపై ఆధారపడే తెలంగాణ ప్రజలకు న్యాయం జరిగేలా పీఎం ఏక్తా మాల్ ఉద్దేశాన్ని కాపాడాలని, ప్రభుత్వ భూమిని తిరిగి ప్రజా ప్రయోజనాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సాయిబాబా, నవతారెడ్డి, సీనియర్ నాయకులు పురుషోత్తం యాదవ్, గొట్టుముక్కల పెద్ద భాస్కరరావు, మాచర్ల భద్రయ్య, హరీష్‌రావు, రవి యాదవ్, సతీష్‌రావు, శ్రీనివాస్ గౌడ్, రవీందర్ యాదవ్, అనిల్‌రెడ్డి, శ్రీకాంత్, రోజా, మమత, కార్తీక్‌రెడ్డి, శివరాజ్, మల్లేష్, మల్లారెడ్డి, నరేందర్ యాదవ్, విజయ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కొండలరావు, జగదీష్ గౌడ్, వాసు, జైకుమార్, నరేష్ మోహన్ చారి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్‌సీ అమలు చేయాలి: ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

- **మంచాల డిప్యూటీ తహసిల్దార్ కు వినతి పత్రం అందజేసిన టీఎస్ యుటిఎఫ్ నాయకులు**

**మంచాల వెలుతురు ఆగస్టు 12:**



మంచాల మండలం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో దశలవారీ కార్యక్రమం లో భాగంగా మంచాల మండలం డిప్యూటీ తహసీల్దార్ వినోద్ కుమార్ గారికి వినతి పత్రం అం దజేసిన టీఎస్ యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా కోశాధికారి డాక్టర్ జగన్నాథ్ మండల అ ధ్యక్షుడుడాక్టర్ మహమ్మద్ అజ్మత్ ఖాన్ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పిఆర్ సిని వెం టనే అమలు చేయాలి6విడతల డిఏను ప్రకటించాలని ప్రధానమైన డిమాండ్లతో పాటు 29 ఉ పాధ్యాయ సమస్యలపై వినతిపత్రం అందజేశారు ఈకార్యక్రమంలో మండలం మండల ప్రధాన కార్యదర్శి తుల్జారామ్ మండల ఉపాధ్యక్షులు మండల యాదయ్య మరియు యాదయ్య తది తరులు పాల్గొన్నారు.

# దాద్‌పల్లి సీసీ రోడ్డుకు రూ.25 లక్షలు మంజూరు

- **యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు పాలకుర్ల శేఖర్ గౌడ్**

**మంచాల వెలుతురు ఆగస్టు 12:**

మంచాల మండలందాద్ పల్లి గ్రామంలో యూత్ కాంగ్రెస్ జిల్లానాయకుడు పాలకుర్ల శేఖర్ గౌడ్ మాట్లాడుతూ దాద్ పల్లి గ్రామఅభివృద్ధి కోసం గ్రామంలో సీసీ రోడ్డు కావాలి అని దాద్ పల్లి గ్రా మ కాంగ్రెస్ పార్టీనాయకులు ప్రియతమ అభివృద్ధి ప్రదాత ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారిని కలిసి సమస్య చెప్పగానే వెంటనే స్పందించి సీసీ రోడ్డు నిర్మాణానికి 25 లక్షలు మంజూరు చేసిన ప్రియ తమ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలి పారు ఎమ్మెల్యేగారి సహకారంతో అర్హులైన పేద కుటుంబాల అందరికీ ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు పించన్లు మంజూరు చేయిస్తాం అనిఅన్నారు



కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పార్టీలకు అతీతం గా అర్హులైన ప్రతిపేద కుటుంబానికి ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది అని అన్నారు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో దాద్ పల్లి గ్రామా న్ని అన్నిరకాల మౌలిక వసతులతో పూర్తిస్థా యిలో అభివృద్ధి చేయిస్తాం అని అన్నారు.

# హుజురాబాద్‌లో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ..

- **దేశభక్తి, ఐక్యతే లక్ష్యం: గంగాడి కృష్ణారెడ్డి**

**హుజురాబాద్ వెలుతురు ఆగస్టు 12:**



హుజురాబాద్ పట్టణంలో బుధవారం రోజున దేశభక్తిని చాటేలా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ తిరంగా ర్యాలీలో బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడారు. దేశభక్తి భావనను పెంపొందించడానికి, ప్రజల్లో జాతీయ ఐక్యతను చాటడానికే ప్రతి ఏటా ఈ మోడీ ప్రభుత్వం హర్ ఘర్ తిరంగా అభియాన్ అభియాన్ పేరిట ప్రోగ్రాం నిర్వహిస్తుందని తెలిపారు. ,దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. త్రివర్ణ పతాకం మన జాతీయ గౌరవానికి, సార్వభౌమత్వానికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా దేశం కోసం అందరూ ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు. ఈ ర్యాలీలో జాతీయ జెండాలను చేతబూని నాయకులు, కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. "భారత్ మాతా కీ జై" నినాదాలతో పట్టణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు రాష్ట్ర బీజేవైఎం ఉపాధ్యక్షులు నరేడ్ల ప్రవీణ్ రెడ్డి కౌన్సిలర్ పంజాల మనోజ్ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- **అప్రమత్తతే సైబర్ నేరాల నుంచి రక్షణ**
- **అనుమానాస్పద కాల్స్ మెసేజ్‌లు లింకులకు స్పందించకుండా వెంటనే పోలీసుల దృష్టి కి తీసుకురావాలి**
- **ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లపై ప్రజలకు సూచన ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి**

**ఇబ్రహీంపట్నం వెలుతురు ఆగస్టు 12:**

ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ సీఐ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాల పట్ల ప్ర జలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అన్నారు ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్తపద్ధతుల్లో ప్రజలనుమోసం చేస్తున్నారని ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాలు డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరింపులు నకిలీ లింకులు ఓటీపీ మోసాలు బ్యాంకుఖాతా ల వివరాల సేకరణ వంటి వాటిపై ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని తెలిపారుప్రస్తుతం సైబర్ నేరగాళ్లు పోలీసు అధికారులు ప్రభుత్వఅధికారులు బ్యాంకు సిబ్బంది పేర్లను ఉపయోగించి ప్ర జలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్ పేరుతో వీడియోకాల్‌లో మాట్లాడిస్తూ తమపై కేసు నమోదైందని లేదా అక్రమ కార్యకలాపాల్లో తమపేరు ఉందని చెప్పిడబ్బులు డిమాండ్ చేసే మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు ఏ ప్రభుత్వ సంస్థ కూడా ఫోన్ లేదా వీడియో కాల్ ద్వారా వ్యక్తులను డిజిటల్ అరె స్ట్ చేసి డబ్బు లు చెల్లించాలని ఆదేశించదని స్పష్టంచేశారు అలాగే బ్యాంకు ఖాతానంబర్ ఏటీఎం కార్డు వివ రాలు ఓటీపీ పిన్ పాస్‌వర్డ్‌లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచితుల తో పంచుకోవద్దన్నారు గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయడం అనుమానా స్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడం సోషల్ మీడియాద్వారా వచ్చేనకిలీ ఆఫర్లను నమ్మడం వం టివి చేయకూడదని హెచ్చరించారు ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెడితే భారీలాభాలువస్తాయ ని చెప్పే ప్రటనలు. ఉద్యోగాలు ప్పిస్తామని చెప్పేనకిలీ ఆఫర్లు కస్టమర్ కేర్ పేరుతో వచ్చేఫోన్ కాల్స్ పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలని మహేందర్ రెడ్డి సూచించారు సోషల్ మీడియాఖాతాల కు.



బలమైన పాస్‌వర్డ్ లు ఏర్పాటు చేసుకోవడంతో పాటు అవసరమైన చోట టూఫ్యాక్టర్ ఆథెం టికేషన్ వినియోగించాలని తెలిపారు సైబర్ మోసానికి గురైనట్లు అనుమానం వచ్చిన వెంటనే భయపడకుండా సంబంధిత బ్యాంకుకు సమాచారం అందించి లావాదేవీలను నిలిపివేసే చర్యలు తీసుకోవాలని సూచించారు అలాగే ఆలస్యం చేయకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు సైబర్ నేరాలను అరికట్టడంలో ప్రజల అప్రమత్తత ఎంతో కీలకమని ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని సురక్షితంగా వినియోగించుకోవాలని ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి కోరారు.

# ఆత్మహత్య చేసుకున్న కానిస్టేబుల్ సాయి కుటుంబాన్ని ఆదుకుంటాం

- **కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించేందుకు కృషి చేస్తాం**
- **ఇందిరమ్మ ఇల్లుతో పాటు తండ్రికి పెన్షన్ సౌకర్యం**
- **ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి హామీ**

**ఇబ్రహీంపట్నం వెలుతురు ఆగస్టు 12:**



ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎన్నోకలలతో ఉద్యోగంలో చేరి అర్థాంతరంగా తనువు చాలించి న మంచాల మండలం బండాలేమూర్ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ సాయిఆత్మహత్య ఘటన పై ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు తీవ్ర విచారం వ్యక్తంచేశారు ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ వద్దఆం దోళనకుదిగిన కుటుంబ సభ్యులు బంధువులతో మాట్లాడిన ఆయన దుర్ఘటనపై పోలీస్ ఉన్నతా ధికారులతో మాట్లాడారు విధి నిర్వహణలో సాయిని ఇబ్బందికిగురి చేశారన్న ఆరోపణలపైపూర్తి స్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారుల కు మల్ రెడ్డి రంగారెడ్డి సూచించారు ఈమేరకు మల్కాజ్‌గిరి సీపీ డీసీపీతో మాట్లాడారుసాయి కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామన్న ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించేలా కృషి చేస్తామని అన్నారు అలాగే రూ.22లక్షలను ప్రభుత్వం నుంచి అందజేయనున్నట్లు ప్రకటించిన ఆయన తక్షణసాయం కింద రూ10లక్షలు ఇస్తున్నట్లు చెప్పారు తన నియోజకవర్గానికి చెందిన సాయి కుటుంబానికి ఇందిరమ్మఇల్లు మంజూరుతో పాటు తం డ్రికి పెన్షన్ వచ్చేలాచూస్తానని ఎమ్మెల్యే హామీఇచ్చారు ఉద్యోగులకు ఉన్న కోటి రూపాయల బీ మా సాధ్యపడే అవకాశం లేక పోవచ్చన్న మల్ రెడ్డి దీనిపై సీఎంతో ప్రత్యేకంగామాట్లాడతా న న్నారు మల్ రెడ్డి రంగారెడ్డి గారు మరియు ఉన్నతాధికారుల హామీ మేరకు కుటుంబసభ్యులు ఆందోళన విరమించారు.




ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఆత్మహత్య చేసుకున్న కానిస్టేబుల్ సాయి

# శ్రీ భాగ్యనగర్ మహాకాళి బోనాల జాతర ముగింపు వేడుకలు ఘనంగా

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 12 :**

శ్రీ భాగ్యనగర్ మహాకాళి బోనాల జాతర 2026 ముగింపు వేడుకలను ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జాతర విజయవంతంగా పూర్తైన సందర్భంగా గ్రాండ్ క్లోజింగ్ సెరిమనీ, అధికారుల సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నారు. బోనాలు–2026ను విజయవంతం చేయడంలో సహకరించిన అధికారులు, ప్రజలు, భక్తులు, కమిటీ సభ్యులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. జాతరను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరి సహకారం ఎంతో కీలకమైందని పేర్కొన్నారు.




ఈ సందర్భంగా జాతర నిర్వహణలో విశేషంగా కృషి చేసిన అధికారులను సన్మానించడంతో పాటు, కార్యక్రమంలో భాగస్వాములైన వారికి అభినందనలు తెలియజేయనున్నారు. "బోనాలు –2026ను ఘన విజయంగా నిలిపారు.. కలిసి చరిత్ర సృష్టించాం" అనే సందేశంతో నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి శ్రీ మల్యాల మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో చేసినట్లు బ్యానర్‌లో పేర్కొన్నారు. తె లంగాణ సంస్కృతి, ప్రతీక గా నిలిచే బోనాల పండుగను విజయవంతంగా నిర్వహించిన ప్రతి ఒక్కరికీ కమిటీ తరఫున ధన్యవాదాలు తెలిపారు.

# రోడ్డును కబ్జా చేసిన కౌన్సిలర్ పై చర్యలు తీసుకోవాలి

## యాదగిరిగుట్ట పట్టణ బిఆర్ఎస్ పార్టీ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి డిమాండ్

**యాదగిరిగుట్ట , ఆగస్టు 12 (వెలుతురు):**

యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డులో రెండవ వార్డ్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ బూడిద మధు యదేచ్ఛగా రోడ్డును కబ్జా చేశారని ఆయనపై మున్సిపల్ అధికారులు, సంబంధిత అధికారులు తక్షణమే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ యాదగిరిగుట్ట పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి నాలుగో వార్డులో కబ్జాకు గురైన రోడ్డు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల ఇండ్ల వారిని కలిసి అక్కడ రోడ్డు ఉందా ? లేదా ? అనే విషయంపై ఆరా తీశారు . వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండవ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ బూడిద మధు అధికార పార్టీ అండతో నాలుగో వార్డులో రోడ్డును కబ్జా చేసి లక్షలాది రూపాయల విలువైన స్థలాన్ని ఆక్రమించారని విమర్శించారు. అక్కడ రోడ్డు ఉన్నప్పటికీ లేఔట్ లో రోడ్డు చూపిస్తున్నప్పటికీ దొడ్డిదారిలో డాక్యుమెంట్లు తయారు చేయించుకుని ఆ స్థలం తనదని చెబుతున్నారని ఇది సరి అయింది కాదని అన్నారు. ఆ రోడ్డు చుట్టుపక్కల ఉన్న కాలనీవాసుల వద్ద ఉన్న డాక్యుమెంట్లను తాము పరిశీలించమని డాక్యుమెంట్లలో స్పష్టంగా రోడ్డు ఉందని అన్నారు. గత 10 రోజుల క్రితం స్థానిక కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ కు ఈ విషయమై ఫిర్యాదు చేశారని అయినప్పటికీ కమిషనర్ పట్టించుకోవడంలేదని విమర్శించారు. దీని వెనుక ఎవరెవరు ఉన్నారనే విషయంపై అధికారులు విచారణ జరిపి వారందరిపై చర్య తీసుకోవాలని అన్నారు. ఇప్పటికైనా రెండొవ వార్డు కౌన్సిలర్ బూడిద మధు కబ్జా చేసిన స్థలం నుండి తప్పుకోవాలని డిమాండ్ చేశారు . లేకపోతే తాము పెద్ద ఎత్తున బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని అన్నారు. మున్సిపల్ అధికారులు తక్షణమే రోడ్డును కబ్జా చేసిన స్థలంలో ఏర్పాటు చేసిన ప్రహరీలను తొలగించాలని, తిరిగి రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ముట్టడించి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా



ఆయన ఫోన్లో మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడారు. రెండవ వార్డ్ కౌన్సిలర్ బూడిద మధు నాలుగవ వార్డులో రోడ్డు కబ్జా చేస్తుంటే మీరేం చేస్తున్నారు ? అంటూ ఆయన ప్రశ్నించారు. తక్షణమే విచారణ జరిపి రోడ్డు కబ్జాను తొలగించాలని లేకపోతే మీపై కలెక్టర్కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఈ అంశంపై విచారణ జరుపుతున్నామని, తగిన ఆధారాలు సేకరించి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ పాపట్ల నరహరి కి ఫోన్లో తెలిపారు. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ నాయకులు దండెబోయిన వీరేష్ యాదవ్, కల్వకొలను సతీష్ బట్, రాచకొండ శ్రీనివాస్, భిక్షాల ఎల్లస్వామి, మాటూరి బాలయ్య గౌడ్, ఎస్.కె నజీర్, సిహెచ్ చిరంజీవి, బండి వాసు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటమిని జీర్ణించుకోలేకే... నిరాధారమైన ఆరోపణలు

- యాదగిరిగుట్ట రెండో వార్డు కౌన్సిలర్ బూడిద మధు

**యాదగిరిగుట్ట , ఆగస్టు 12 ( వెలుతురు):**

తాను నాలుగో వార్డ్ లో రోడ్డును కబ్జా చేశానని బిఆర్ఎస్ టౌన్ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని, మున్సిపల్ ఎన్నికల్లో ఆయన తనపై పోటీ చేసి ఓటమిపాలు అయ్యారని, ఆ ఓటమిని జీర్ణించుకోలేక తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని రెండో వార్డు కౌన్సిలర్ బూడిద మధు అన్నారు. బుధవారం నాలుగవ వార్డులోని తన ప్లాట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ స్థలం తనకు పూర్వీకుల నుండి వచ్చిందని అన్నారు. తన తాత, తండ్రి ద్వారా తనకు ఈ స్థలం రిజిస్ట్రేషన్ ద్వారా వచ్చిందని చెప్పారు. తాను ఏలాంటి కబ్జాలు చేయలేదని అన్నారు. తన ఈ ప్లాటుకు సంబంధించిన పాస్ బుక్కులు, డాక్యుమెంట్లు అన్ని ఆధారాలు ఉన్నాయని అన్నారు. తనపై ఆరోపణలు, విమర్శలు చేసేవారు అందుకు సంబంధించిన ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు. బి ఆర్ ఎస్ నాయకుడు పాపట్ల నరహరి తన చేతిలో మున్సిపల్ ఎన్నికల్లో ఓటమిపాలయ్యారని, ఆయన ఓటమిని జీర్ణించుకోలేక, ఏం చేయాలో తోచక , ఆయనకు ఏటు అర్థం కాక , ఆయనకు బిఆర్ఎస్ పార్టీలో రాజకీయ భవిష్యత్తు లేక, కేవలం ప్రచారం కోసం తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఆయన తనపై చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని అన్నారు. ఈ స్థలం తనకు మున్సిపల్ ఎన్నికలకు ముందే తన తండ్రి తనకు రిజిస్ట్రేషన్ చేశారని అన్నారు. ఎన్నికల తర్వాత నేను వార్డు కౌన్సిలర్ గా గెలిచిన తర్వాత ఈ స్థలం రిజిస్ట్రేషన్ చేయించుకోలేదని అన్నారు. కౌన్సిలర్ పదవిని అడ్డం పెట్టుకొని తాను ఎలాంటి కబ్జాలు చేయలేదని అన్నారు. ఈ సందర్భంగా ఆయన తన స్థలానికి సంబంధించిన



డాక్యుమెంట్లు, పాస్ బుక్ ను ఆయన విలేకరులకు ప్రదర్శించారు. తనపై పాపట్ల నరహరి చేసిన ఆరోపణలను నిరూపించాలని సవాల్ చేశారు. ఆయన వద్ద ఉన్న ఆధారాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కేవలం రాజకీయ కక్షతోనే ఇలాంటి ఆరోపణలు, విమర్శలు చేయడం తగదని అన్నారు. తాను పూర్తిగా న్యాయబద్ధంగా తన పూర్వీకుల నుండి వచ్చిన స్థలంలోనే ఉన్నానని , రోడ్డును ఆక్రమించడం , ఇతరుల స్థలాలను కబ్జా చేయలేదని, అలాంటి గుణం తనది కాదని రెండవ వార్డు కౌన్సిలర్ బూడిద మధు స్పష్టం చేశారు.

# రైతులు వర్షాధార పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి

- మండల ప్రత్యేక అధికారి భారతి

**నూతనకల్ ఆగస్టు 12(వెలుతురు):**

మండల పరిధిలోని బిక్కుమళ్ళ గ్రామంలో ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి భారతి మాట్లాడుతూ ఎల్ నీనో ఎఫెక్ట్ తో గ్రౌండ్ వాటర్ శాతం పడిపోవడం వలన నీటిని తక్కువ ఉపయోగించుకునే పంటలు పెసర కంది మినుము పత్తి పామ్ ఆయిల్ పంటలు వేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, ఏఈఓ సంధ్య, పంచాయతీ కార్యదర్శి ఉమేష్, జిపిఓ



కవిత, రైతులు పాల్గొన్నారు.

# రామన్నపేట పెద్ద చెరువుకు ఫీడర్ ఛానల్ ఏర్పాటు చేయాలి

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 12:**

రామన్నపేట పెద్ద చెరువుకు ధర్మారెడ్డిపల్లి కాలువ ద్వారా ఫీడర్ ఛానల్ ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి కందుల హనుమంతు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం, ముదిరాజ్ మత్స్యకారుల సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రామన్నపేట మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కందుల హనుమంతు మాట్లాడుతూ రూ.300 కోట్ల నిధులతో కాలువ నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో కొమ్మాయిగూడెం మీదుగా వెళ్తున్న



ధర్మారెడ్డిపల్లి కాలువకు ఫీడర్ ఛానల్ ఏర్పాటు చేసి రామన్నపేట పెద్ద చెరువుకు నీటిని అందించాలని కోరారు. కాలువ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు, మత్స్యకారులకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించి, రామన్నపేట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పిట్టల మచ్చగిరి, బచ్చా రాములు, కందుల శ్రీశైలం, బచ్చా వెంకటేశం, రేపాక పోచమ్మ, కందుల లలిత, కేశబోయిన ఇంద్రమ్మ, లక్ష్మి, సత్తమ్మ, పద్మ, యాట అనసూయ, మంగమ్మ, లక్ష్మి, సిద్ధం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐలయ్య కుటుంబానికి ట్రాక్టర్ ఓనర్స్ అసోసియేషన్ ఆర్థిక సాయం

- రూ.22,500 ఆర్థిక సహాయం అందజేత

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 12:**

మండలం చెందిన దుబ్బాక గ్రామానికి చెందిన రేవనాల ఐలయ్య ఇటీవల మరణించినాడు. నీర్నంల గ్రామానికి చెందిన శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ట్రాక్టర్ ఓనర్స్ అసోసియేషన్ నీర్నంల వారి కుటుంబానికి అండగా 22,500 ఆర్థిక సహాయం



అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కొత్త పరశురాములు ఉపాధ్యక్షులు పాక రాజు ప్రధాన కార్యదర్శి కదారి వెంకన్న ట్రెజరర్ సాగర్ల వెంకన్న సభ్యులు నాగటి గణేష్, కదారి నాగరాజు, కొత్త ఉపేందర్ ఇర్రి సురేష్, ఆవుల లక్ష్మీనారాయణ పాక. మని పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై కాంగ్రెస్ క్యాడర్ ప్రజల చెంతకు లీడర్

- మార్నింగ్ వాక్ కాదు.. ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పోకాస్
- ప్రజల చెంతకు కాంగ్రెస్ క్యాడర్..! సంక్షేమ పథకాలపై ఆరా
- ప్రజల సమస్యలే ఎజెండా..! గుండాలలో కాంగ్రెస్ క్యాడర్ దూకుడు

**గుండాల ఆగస్టు 12( వెలుతురు):**

ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు కాంగ్రెస్ శ్రేణులు మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో నేరుగా మమేకమైన ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఈరసరపు యాదగిరి గౌడ్, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా..? అని ఆరా తీశారు. అర్హత ఉన్నా పథకాలు అందని వారెవరైనా ఉన్నారా..? పథకాల అమలులో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి..? అనే విషయాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చేస్తామని తెలిపారు.

### ప్రజల మధ్యకే కాంగ్రెస్ క్యాడర్..

ప్రజల సమస్యలు తెలుసుకోవడం.. అర్హులను గుర్తించడం.. సంక్షేమ ఫలాలు అందించడం లక్ష్యంగా క్షేత్ర స్థాయిలో చేయాలని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొన్నాయి.



### మార్నింగ్ వాక్కు రాజకీయ ప్రాధాన్యత..

సాధారణ మార్నింగ్ వాక్కు భిన్నంగా ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోవడం ఈ కార్యక్రమంలో ప్రత్యేకతగా నిలిచింది. నాయకుడు ప్రజల మధ్యకు వెళ్తే.. క్యాడర్ సైతం ప్రజల వెంటే నడవాలనే సందేశం ఈ కార్యక్రమం ద్వారా స్పష్టమైంది. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పొడిచేటి వెంకన్న మండల పార్టీ అధ్యక్షులు ఇమ్మడి దశరథ గుప్తా గ్రామ సర్పంచ్ కొడపర్తి భాస్కర్ సర్పంచ్ దేవనబోయిన ఐలయ్య ఉపసర్పంచ్ ఆవుల సాయి ప్రసాద్ మైస రమేష్ కొల్లిపాక శ్రీను యండి అబ్బాస్ ఆవుల శీను తదితరులు పాల్గొన్నారు.



# మునిపంపుల హైస్కూల్ కు సౌండ్ సిస్టమ్ బహుకరణ

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 12:**

గ్రామం మునిపంపుల హై స్కూల్ కు సేవా భారతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు మన్నే పద్మా రెడ్డి బుధవారం రోజు 25 000,00 (ఇరవై ఐదు వేల రూపాయలు) విలువైన మొబైల్ సౌండ్ సిస్టమ్ ను పాఠశాల విద్యా కార్యక్రమాల నిమిత్తం బహుకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యతు లో కూడా పాఠశాల కు సహాయ సహకారాలు అందిస్తానని 10 వ తరగతి లో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు అభినందన పురస్కారాలను అందిస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొడ్డి స్వామి ఉపాధ్యాయులు వారిని పాఠశాల తరపున సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. హెడ్మాస్టర్ దొడ్డి స్వామి మాట్లాడుతూ గ్రామంలోని ఉన్నత స్థానంలో ఉన్న పెద్దలు తాము చదువుకున్న పాఠశాల ఉన్నతికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా మన్నే పద్మా రెడ్డి ని గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుముల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, మనోహర్, మంజుల, త్రివేణి ప్రసాద్, మంజుల,శ్రీశైలం, సునీత, రాకేష్, విద్యార్థులు పాల్గొన్నారు.ప్రధానోపాధ్యాయులు జెడ్ పి హెచ్ ఎస్ మునిపంపుల మ.రామన్నపేట

# త్యాగం, సేవ, సమర్పణ భావమును యువత కలిగి ఉండాలి

**చౌటుప్పల్ వెలుతురు ఆగస్టు 12:**

చౌటుప్పల పట్టణ కేంద్రంలోని గాంధీ పార్కులో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని 'యువ సమ్మేళనం' బుధవారం నిర్వహించారు. చౌటుప్పల ఖండ , పోచంపల్లి ఖండ, రామన్నపేట ఖండ యువత ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. సభ వందేమాతర గీతంతో ప్రారంభమైనది. తెలంగాణ ప్రాంత సహ ప్రచారక్ కల్పగురు ప్రభు కుమార్ జి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగిస్తూ యువత త్యాగం, సేవ, సమర్పణ భావమును కలిగి ఉండాలని అన్నారు . ప్రతి యువకుడు దేశభక్తుడై ఉండాలని, భారతదేశాన్ని విశ్వగురు స్థానములో నిలుపాలని, ప్రతి విద్యార్థి భారతీయ చరిత్రను అధ్యయనం చేయాలని, ప్రతినిత్యం ఎక్కువ సమయం మనుషులతో గడపడానికి ప్రయత్నించాలని, దేశం కోసం జీవించాలని తెలిపారు. యువభారతాన్ని సౌశీల్యంతో సన్మార్గంలో నడపడానికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 100 సంవత్సరాలుగా పనిచేస్తుందని అన్నారు. ఎవరికివారు తమ గురించి ఆలోచించకుండా దేశం గురించి ఆలోచించాలని అన్నారు. సంస్కారవంతమైన సమాజం తయారు కావాలని అందు గురించే విద్యార్థి దశ నుంచి సంస్కారమును అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విభాగ్ సహకార్యవాహ తాడెం పాండు జి. జిల్లా




కార్యవాహ కె. కృష్ణయ్య జి, అఖిల భారత విద్యార్థి పరిషత్ నల్లగొండ విభాగ కన్వీనర్ సుర్వి మణికంఠ , యాదాద్రి భువనగిరి జిల్లా కన్వీనర్ ఉబ్బు సాయికిరణ్ , ప్రచార ప్రతినిధి నారీ మధు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చౌటుప్పల ఖండ మహిపాల్ రెడ్డి కార్యవాహ బడుగు శ్రీరాములు, సహకార్యవాహ రేణు కుమార్, శారీరకప్రముఖ మోదుగు కమలాకర్ రెడ్డి, సద్భావన ప్రముఖ ఏ. మహిపాల్ రెడ్డి, ధర్మజాగరణ ప్రముఖ డాక్టర్ వేముల నరసింహ, పర్యావరణ ప్రముఖ సిలువేరు శ్రీనివాస్ , భారతీయ జనతా పార్టీ నాయకులు, వివిధ కళాశాలల విద్యార్థులు చౌటుప్పల ఖండ ప్రాంత యువకులు పాల్గొన్నారు.



# విద్యా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు కొనసాగిస్తాం

**మునుగోడు, ఆగస్టు 12(వెలుతురు):**

విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొడుతూ విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి గోపగోని ఉదయ్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ 91వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మునుగోడులో మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడుతూ.. 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించి స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకంగా పాల్గొందన్నారు. స్వాతంత్ర్యానంతరం శాస్త్రీయ విద్యా విధానం కోసం అనేక పోరాటాలు నిర్వహిస్తూ విద్యార్థుల సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తోందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలోనూ ఏఐఎస్ఎఫ్ కీలకపాత్ర పోషించిందని తెలిపారు. అన్ని విద్యార్థి సంఘాలను ఏకం చేసి జేఏసీల ఏర్పాటుకు




కృషి చేసిందన్నారు. విద్యార్థులు ఏఐఎస్ఎఫ్‌లో భాగస్వాములై భవిష్యత్ ఉద్యమాలకు నాంది పలకాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురిజా రామచంద్రం, తీరుపారి వెంకటేశ్వర్లు, బి.లాలయ్య, మండల కార్యదర్శి చాపల శ్రీను, ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్ నాయకులు కట్కూరి లింగస్వామి,గడ్డం ప్రవీణ్,శివర్ల నాగరాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన

- గుండాల ఎస్సై వి సైదులు

**గుండాల, ఆగస్టు 12 (వెలుతురు):**

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు గుండాల పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ–ట్రాఫిక్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ వి. సైదులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాహనదారులకు రోడ్డు భద్రతా నియ మాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో సీట్ బెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతివేగంగా వాహనాలు నడపకుండా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని అవగాహన కల్పించారు. రోడ్డుపై వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వి. సైదులు సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రమాదాలకు దారితీసే అవకాశం



ఉన్నందున ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వి. సైదులు, పోలీస్‌స్టేషన్ సిబ్బంది ప్రశాంత్ గౌడ్ .నరేష్ .పాల్గొని వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

# జిల్లా బీజేపీ OBC మోర్చా ప్రధాన కార్యదర్శిగా కొరివి శంకర్ నియామకం

**నార్కట్ పల్లి వెలుతురు ఆగస్టు 12:**

నల్లగొండ జిల్లా బీజేపీ OBC మోర్చా ప్రధాన కార్యదర్శిగా ఏపీ లింగోటం గ్రామ ఉపసర్పంచ్ కొరివి శంకర్ నియమితులయ్యారు.వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ నా ఎన్నికకు కృషి చేసిన జిల్లా బీజేపీ పార్టీ అధ్యక్షులు డాక్టర్ నాగం



వర్షిత్ రెడ్డి , జాతీయ నాయకులు గోలి మధుసూ దన్ రెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నకిరేకంటి మొగులయ్య , నూకల వెంకట్ నారా యణ రెడ్డి , OBC మోర్చా జిల్లా అధ్యక్షులు పిట్టల శ్రీనివా స్, జిల్లా ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న లకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే, నాకు సహకరించిన రాష్ట్ర, జిల్లా, మండల గ్రామ కార్యకర్తలకు ధన్య వాదా లు తెలుపు. భారతీ య జనతా పార్టీ నాపై నమ్మకాన్ని నిలబెట్టు కుంటూ, పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాను. కార్యకర్తకు అండగా నిలుస్తూ, OBC మోర్చా బలోపేతానికి చేస్తానని అన్నారు.

# ఎక్సైజ్ నిబంధనలకు బార్ యాజమాన్యాల తూట్లు!

- సితార బార్‌పై ఆధారాలతో ఫిర్యాదు...
- మద్యం అక్రమ తరలింపుపై సమగ్ర విచారణకు డిమాండ్...
- తూతూమంత్రపు తనిఖీలతో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందా?
- సామాజిక కార్యకర్త పబ్బతి సంతోష్ కుమార్....

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 12:**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన ఎక్సైజ్ పాలసీ, శాఖ నిర్దేశించిన నిబంధనలకు జహీరాబాద్ పట్టణంలోని కొన్ని బార్ యాజమాన్యాలు తూట్లు పొడుస్తున్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. అధిక సంపాదనే లక్ష్యంగా నిబంధనలను పక్కనపెట్టి మద్యం స్టాక్‌ను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఆరోపణలపై ఎక్సైజ్ శాఖ కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సితార రెస్టారెంట్ అండ్ బార్‌కు సంబంధించి నిబంధనల ఉల్లంఘన జరుగుతోందంటూ సామాజిక కార్యకర్త పబ్బతి సంతోష్ కుమార్ బుధవారం జహీరాబాద్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు ఆధారాలతో లిఖితపూర్వక ఫిర్యాదు చేశా రు. బార్‌కు కేటాయించిన మద్యం స్టాక్ నిబంధనలకు విరుద్ధంగా ఇతర ప్రాంతాలకు తరలించారా? అనధికారిక విక్రయ కేంద్రాలకు మద్యం చేరిందా? అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన కోరారు.

### బార్ స్టాక్ బయటకు ఎలా వెళ్లింది?

బార్‌కు కేటాయించిన మద్యం బాటిల్ అనధికారిక విక్రయ కేంద్రంలో కనిపిస్తే దాని వెనుక ఉన్న సరఫరా వ్యవస్థపై అధికారులు లోతుగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని సంతోష్ కుమార్ పేర్కొన్నారు. స్టాక్ రిజిస్టర్లు, కొనుగోలు వివరాలు, విక్రయ రికార్డులు, బార్‌లోని మద్యం నిల్వలను క్షుణ్ణంగా పరిశీలిస్తే అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అన్నారు.

### వార్తలు వస్తేనే తనిఖీలా?

ఎక్సైజ్ నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే అధికారులు పారదర్శకంగా తనిఖీలు నిర్వహించాల్సి ఉండగా, కొన్ని సందర్భాల్లో పత్రికల్లో వార్తలు ప్రచురితమైన తర్వాత మాత్రమే హడావుడిగా తనిఖీలు చేపడుతున్నారనే విమర్శలు ఉన్నాయని సంతోష్ కుమార్ ఆరోపించారు. తనిఖీలు తూతూ మంత్రంగా కాకుండా రికార్డుల ఆధారంగా సమగ్రంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

### 'ఎవరినీ ముందుగానే దోషులుగా తేల్చడం లేదు':

"ఎవరినీ ముందుగానే దోషులుగా నిర్ధారించడం మా ఉద్దేశం కాదు. కానీ ఆరోపణలకు ఆధారాలు ఉంటే అధికారులు వాటిని నిర్లక్ష్యం చేయకూడదు. బార్ స్టాక్ నుంచి మద్యం బయటకు వెళ్లిందా? వెళ్లి ఉంటే ఎవరి ద్వారా వెళ్లింది? ఎక్కడికి చేరింది? రికార్డుల్లో ఏముంది? అనే అంశాలను తేల్చాలి. తప్పు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. తప్పు జరగలేదని తేలితే ఆ వాస్తవాన్ని కూడా ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలి" అని సంతోష్ కుమార్ అన్నారు.

### ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా:



ఈ వ్యవహారంపై స్థానిక ఎక్సైజ్ అధికారులతో పాటు ఉన్నతాధికారులు కూడా దృష్టి సారించి నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ఆయన కోరారు. అవసరమైతే ఫిర్యాదుకు సంబంధించిన ఆధారాలను రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఇదిలా ఉండగా, ఈ ఆరోపణలపై వివరణ కోసం జహీరాబాద్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డిని పలుమార్లు ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ స్పందన రాలేదని సంతోష్ కుమార్ తెలిపారు. సితార బార్‌పై వచ్చిన ఆరోపణలపై ఎక్సైజ్ శాఖ ఎలాంటి చర్యలు తీసుకుంటుంది? ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకువస్తుందా? నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# పూల సంతోష్ నివాసంలో జాతీయ జెండా ఆవిష్కరణ



**జహీరాబాద్ వెలుతురు, ఆగస్టు 12:**


"నా ఇల్లు–నా జెండా–నా దేశం" నినాదంతో జహీరాబాద్ బీజేపీ పట్టణ అధ్యక్షుడు పూల సంతోష్ తన నివాసంలో జాతీయ జెండాను సగర్వంగా ఎగురవేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రజల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత, కర్తవ్య భావనను పెంపొందిస్తోందన్నారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని జాతీయ పతాక గౌరవాన్ని చాటాలని పిలుపునిచ్చారు.

# అమావాస్య.. శ్రావణమాస ప్రారంభం.. ఝరాసంగంలో పోటెత్తిన భక్తజనం

**కేతకి సంగమేశ్వర స్వామిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు**

**ఝరాసంగం వెలుతురు, ఆగస్టు 12:**

సంగారెడ్డి జిల్లాలో దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకి సంగమేశ్వర స్వామి ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. అమావాస్యతో పాటు శ్రావణ మాసం ప్రారంభం కావడంతో స్వామివారి దర్శనం కోసం భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి కూడా భక్తులు ప్రత్యేక వాహనాల్లో ఝరాసంగానికి చేరుకున్నారు.ఆలయానికి చేరుకున్న భక్తులు ముందుగా స్వామివారి అమృతగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి, అనంతరం కేతకి సంగమేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు క్యూ లైన్లలో బారులు తీరారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో స్వామివారి దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది. అయినప్పటికీ భక్తులు ఓపికగా క్యూలైన్లలో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు.అమావాస్య, శ్రావణమాసం



ప్రారంభం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, ఆలయ సిబ్బంది, పోలీసులు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టారు. క్యూలైన్ల నిర్వహణ, భద్రత, భక్తుల రాకపోకలపై ప్రత్యేక దృష్టి సారించారు.పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు భక్తుల సందడితో కళకళలాడాయి. శ్రావణమాసం ప్రారంభం కావడంతో రానున్న రోజుల్లోనూ ఆలయానికి భక్తుల రద్దీ కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# నిమ్జ్ భూముల రిజిస్ట్రేషన్లు వెంటనే పునఃప్రారంభించాలి

- కుటుంబ అవసరాలకు భూములు అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న నిర్వాసిత రైతులు..

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 12:**

నిమ్జ్ పరిధిలోని భూముల రిజిస్ట్రేషన్లను నిలిపివేయడంతో భూ నిర్వాసిత రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిలిపివేసిన రిజిస్ట్రేషన్లను వెంటనే పునఃప్రారంభించాలని ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.నిమ్జ్ పరిధిలో భూములు ఉన్నాయనే కారణంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో తమ భూములపై ఉన్న హక్కులను అవసరమైన సమయంలో వినియోగించుకోలేకపోతున్నామని రైతులు తెలిపారు. పిల్లల చదువులు, వివాహాలు, వైద్య ఖర్చులు, కుటుంబ అత్యవసర అవసరాల కోసం డబ్బు అవసరమైనప్పటికీ భూములను చట్టబద్ధంగా విక్రయించుకునే అవకాశం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొ



న్నారు. అదేవిధంగా భూ పట్టాదారు మరణించిన సందర్భంలో చట్టప్రకారం అర్హులైన భార్య, పిల్లలు, ఇతర వారసుల పేర్లకు భూమి బదలాయింపు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. నిమ్జ్ భూముల విషయంలోనూ చట్టబద్ధమైన వారసుల హక్కులను గౌరవించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమస్యపై జహీరాబాద్ ఆర్డీఓ, నిమ్జ్ అడిషనల్ కలెక్టర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యేకు వినతి పత్రాలు సమర్పించి సమస్య పరిష్కారానికి చర్యలు కోరనున్నట్లు తెలిపారు."మా భూముల రిజిస్ట్రేషన్లను వెంటనే పునఃప్రారంభించి, రైతుల కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం న్యాయం చేయాలి" అని NIMZ భూ నిర్వాసిత రైతులు డిమాండ్ చేశారు.

# ఆరు డీఏలు వెంటనే మంజూరు చేసి పీఆర్సీ ప్రకటించాలి

- కోహీర్ తహసీల్దార్‌కు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల వినతి

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 12:**

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన యుఎస్‌పీసీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలానికి చెందిన వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు బుధవారం తహసీల్దార్ సుప్రియకు మెమోరాండం సమర్పించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే మంజూరు చేయడంతో పాటు, పీఆర్సీని తక్షణమే ప్రకటించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సంఘాల నాయకులు హెచ్చరించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగులు, ఉపాధ్యా



యులకు సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. డీఏలు, పీఆర్సీ విషయంలో స్పష్టమైన నిర్ణయం తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీజీహెచ్‌ఎం శ్రీమతి శారద (ఎస్టీఎఫ్ఐ కౌన్సిల్ సభ్యురాలు), రామ్ చందర్ భీమ్ వంశీ (టీపిటీఎఫ్ పత్రిక సంపాదకులు), టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సాయి తేజ, సింహాచలం, సీహెచ్ విఠల్, టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షులు పి. ప్రసన్న, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, టీపిటీఎఫ్ కార్యదర్శి మేకల శ్రీనివాస్, కార్యదర్శులు అశోక్ కుమార్, రాకేష్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ



- దేశభక్తిని చాటుకున్న బీజేపీ శ్రేణులు...
- బిజెపివెస్ట్ జోన్, ఢిల్లీ డిఫెన్స్ స్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా ర్యాలీని ప్రారంభించిన జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం...

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 12:**

80వ దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ కార్యక్రమంలో భాగంగా, కరీంనగర్ బిజెపి వెస్ట్ జోన్ అధ్యక్షుడుజాడి బాల్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రోజున ఢిల్లీ డిఫెన్స్ విద్యార్థులతో కలిసి తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ఈ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా 2022 సంవత్సరం నుండి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రతి ఏటా అత్యంత వైభవంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రజలందరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేసి, దేశంపై తమకున్న దేశభక్తి భావాన్ని చాటి చెబుతున్నారు. తిరంగా కార్యక్రమాలు దేశ ఐక్యతను మరింత పటిష్టం చేయడానికి, నేటి యువతలో దేశభక్తి భావాలను పెంపొందించడానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, భావితరాలకు దేశభక్తి విలువలను అందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరులను ప్రతి ఒక్కరూ స్మరించుకొని , గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. త్రివర్ణ పతాకం మన జాతీయ గౌరవానికి, సార్వభౌమత్వానికి ప్రతీక. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా దేశం కోసం అందరూ ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.ఈ ర్యాలీలో జాతీయ జెండాలను చేతబూని నాయకులు, కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. "భారత్ మాతా కీ జై" నినాదాలతో నగరంలోని పలు ప్రాంతాలు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమల ఆంజనేయులు , పార్లమెంటు కన్వీనర్ ,కార్పొరేటర్ ప్రవీణ్ రావు, సీనియర్ నాయకులుగుజ్జ శ్రీనివాస రావు , కార్పొరేటర్లు బండ రమణారెడ్డి కర్రె పద్మ అనీల్ , జోన్ అధ్యక్షులు జాడి బాల్ రెడ్డి , బూత్ ప్రెసిడెంట్స రశురాములు, బి ఎల్ ఎ 2లు కాసం సంతోష్, గాడుగోని రమేష్, మల్లారెడ్డి ,చందర్, తిరుమలరెడ్డి, ఉదయ్, నరేష్, బండ రాకేష్, విద్యాసాగర్ ల తో పాటు ఢిల్లీ డిఫెన్స్ స్కూల్ విద్యార్థులు , పెద్ద సంఖ్యలో యువకులు ర్యాలీలో పాల్గొన్నారు.

# బావుపేట రోడ్డు మరమ్మత్తు లకోసం నిధులు కేటాయించింది కేంద్ర మంత్రి బండి సంజయ్..

- నిధుల ఘనత తమదేనని బిఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల ప్రచారం చేసుకోవడానికి సిగ్గుండాలి...
- కొత్తపల్లి బిజెపి మండల అధ్యక్షులు కుంట తిరుపతి...

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 12:**

కరీంనగర్ – కామారెడ్డి ప్రధాన రహదారిలో పూర్తిగా చెడిపోయిన బావుపేట రోడ్డు మరమ్మత్తుల కోసం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ తన ఎంపి నిధుల నుండి రూ. 16 లక్షలు కేటాయించినందుకు బిజెపి కొత్తపల్లి మండల పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు అధ్యక్షులు కుంట తిరుపతి చెప్పారు. బావు పేట వద్ద రోడ్డు మరమ్మత్తుల కోసం రూ. 16 లక్షల ఎంపీ నిధులు కేటాయించడం పట్ల కొత్తపల్లి బిజెపి శాఖ హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం రోజున కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ చిత్రపటానికి పాలాభిషేక కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు కుంట తిరుపతి మాట్లాడుతూ రోడ్డు మరమ్మతుల కోసం నిధులు ఇచ్చింది కేంద్రమంత్రి బండి సంజయ్ అయితే.. కరీంనగర్ టిఆర్ఎస్ ఎమ్మెల్యే క్రెడిట్ కోసం పాకులాడుతున్నారని ఘాటుగా విమర్శించారు. బావుపేట రోడ్డు నిర్మాణానికి కేంద్రమంత్రి బండి సంజయ్ నిధులు మంజూరు చేస్తే, ఆ ఘనతంతా తమదేనంటూ బిఆర్ఎస్ నేతలు, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రచారం చేసుకోవడానికి సిగ్గుండాలన్నారు .. సమస్యను పరిష్కరించాలన్న ఆలోచన బి ఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల చేయలేదని , నేడు సోషల్ మీడియా వేదిక గా రోడ్డు మరమతు విషయంలో బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేసుకోవడం పట్ల ఆయన



మండిపడ్డారు. కరీంనగర్ కామారెడ్డి ప్రధాన రహదారులో ప్రజల ప్రయాణ ఇబ్బందులను తొలగించేందుకు తక్షణ స్పందించి రూ. 16 లక్షలు కేటాయించిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్‌కు కొత్తపల్లి మండల ప్రజల పక్షాన హృదయపూర్వక ధన్యవాదాలను తెలియజేశారు .. ఈ కార్యక్రమంలో మండలంలోని పార్టీ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డ్ మెంబర్లు,సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షలో 645 ర్యాంక్ సాధించిన సెయింట్ ఆన్స్ పూర్వ విద్యార్థినికి సన్మానం

**మోత్కూర్, ఆగస్టు 12,వెలుతురు :**




నీట్ –2026 ప్రవేశ పరీక్షలో రాష్ట్ర స్థాయి 645 ర్యాంక్ సాధించిన సెయింట్ ఆన్స్ పాఠశాల పూర్వ విధ్యార్థిని కుకునూరు సాత్వికా రెడ్డిని సెయింట్ ఆన్స్ పాఠశాల యాజమాన్యం పసల విజయా మరియన్నలు పూల మాల, శాలువా తో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాత్వికా రెడ్డి మాట్లాడుతూ నర్సరీ నుండి పదవ తరగతి వరకు ఈ పాఠశాలలో చదవడం వల్ల చదువులో గట్టి పునాది లభించిందని తద్వారా పై చదువులు సులభంగా అవగతం అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని తల్లితండ్రులు కుకునూరు పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# దిడ్గిలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి.. ఏడుగురు అరెస్ట్

- రూ.5,160 నగదు, 52 పేకముక్కలు, 7 మొబైల్ ఫోన్లు స్వాధీనం

**జహీరాబాద్ వెలుతురు, ఆగస్టు 12:**

జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దిడ్గి గ్రామంలో అక్రమంగా పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. జహీరాబాద్ రూరల్ ఎస్ఐ రాజేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఎం.డి. ఖాజాకు చెందిన వ్యవసాయ భూమిలో బుధవారం సాయంత్రం 5:30 గంటలకు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఏడుగురిని అదుపులోకి తీసుకుని వద్ద నుంచి రూ.5,160 నగదు, 52 పేకముక్కలు, ఏడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై తెలంగాణ గేమింగ్ చట్టం సెక్షన్ 9(1) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యక లాపాలకు పాల్పడవద్దని,



ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని రూరల్ ఎస్ఐ రాజేందర్ రెడ్డి ప్రజలకు సూచించారు.

# ఆదర్శనగర్‌లో రూ.10 లక్షలతో సీసీ డ్రైన్ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన



**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 12:**

కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 26వ డివిజన్ ఆదర్శనగర్‌లో రూ.10 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ డ్రైన్ పైప్‌లైన్ నిర్మాణ పనులకు నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడం నగర పాలక సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు.ఆదర్శనగర్‌లో చేపట్టనున్న సీసీ డ్రైన్ పైప్‌లైన్ పనులు పూర్తయిన అనంతరం కాలనీవాసులకు మెరుగైన పారిశుద్ధ్య వాతావరణం కల్పించడంతో పాటు డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రజల సహకారం ఎంతో అవసరమని, పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ గారు, మున్సిపల్ అధికారులు, కాలనీవాసులు, స్థానిక నాయకులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కొత్తపల్లి జోన్ శాఖ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర



**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 12:**

80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తపల్లి జోన్ అధ్యక్షులు ముత్తునూరి హరీష్ రావు ఆధ్వర్యంలో తిరంగా యాత్ర నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమం ముఖ్య అతిధి బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం , డిప్యూటీ మేయర్ సునీల్ రావు పాల్గొని తిరంగా ర్యాలీని ( బైకులతో బైక్ ర్యాలీ) ప్రారంభించి మాట్లాడారు. నరేంద్ర మోడీ 2022లో ప్రారంభించిన ఈ తిరంగా యాత్ర హర్ గర్ తిరంగా ప్రతి సంవత్సరం ప్రజలు దేశభక్తితో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. దేశ ఐక్యత కోసం ప్రతి ఒక్కరు కూడా ప్రతి ఇంటి మీద జెండా ఎగరవేయాలని సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వాసల రమేష్ , జిల్లా నాయకులు గుంజేటి శివకుమార్ , వేముల చంద్రశేఖర్, రాచకొండ కొమురయ్య, సోమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్, జిట్టవేణి రేనయ్య,తొంటి వీరేశం,దాసరి రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్ ఆర్ రంగనాథన్ జయంతి వేడుకలు

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 12:**



భారత గ్రంథాలయ శాస్త్ర పితామహుడుగా ప్రసిద్ధి గాంచిన ఎస్.ఆర్. రంగనాథన్ జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథపాలకుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్ష వహించిన కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ భారతదేశంలో గ్రంథాలయాల స్థాపన కోసం, వాటి అభివృద్ధి కోసం రంగనాథన్ జీవితాంతం పాటుపడ్డారని అన్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని అటువంటి వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రంథపాలకులు డాక్టర్ రాచమళ్ళ శ్రీను మాట్లాడుతూ లండన్ విశ్వవిద్యాలయంలో గ్రంథాలయ శాస్త్రాన్ని అభ్యసించిన రంగనాథన్ భారతదేశానికి తిరిగి వచ్చి గ్రంథాలయ శాస్త్ర అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసిన మహనీయుడని అన్నారు. గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఆచార్య ఆర్.రత్నమంజుల, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.కిషన్, ఐ క్యూ ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.లక్ష్మీనీలిమతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తలకు హెల్మెట్ జీవితానికి రక్షణ ఎస్ఐ. సతీష్

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 12:**



మనిషి జీవితానికి బీమా ఎలాంటిదో వాహనానికి ఇన్సూరెన్స్ అలాంటిదేనని రామన్నపేట ఎస్సై సతీష్ అన్నారు. ప్రతి ఒక్కరూ వారు వెహికల్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. అలాగే ఎక్కడికి వెళ్లినా హెల్మెట్ తప్పనిసరి ధరించాలని అన్నారు. రోడ్డు భద్రత హెల్మెట్ వలన రక్షణ ఇన్సూరెన్స్ ఉపయోగాలు వంటి అంశాలపై రామన్నపేటలో స్థానిక వాహనదారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు.

# క్యాన్సర్ నివారణపై అవగాహన సందేశం

**చౌటుప్పల్ వెలుతురు ఆగస్టు 12:**



క్యాన్సర్ నివారణకు అందుబాటులో ఉన్న వ్యాక్సిన్ GARDASIL 9 తీసుకున్నానని, నా తమ్ముడు సన్వీర్ కు GARDASIL 4 వైద్యురాలు డాక్టర్ ప్రశాంతి సలహా మేరకు వ్యాక్సిన్ వేయించానని చౌటుప్పల్ కు చెందిన డీ. శాన్వి తెలిపారు. మీరు క్యాన్సర్‌కు సంబంధించిన వ్యాక్సిన్ తీసుకోకపోతే, మీ వయస్సు, ఆరోగ్య పరిస్థితి మరియు వైద్యుల సూచనలను పరిగణనలోకి తీసుకుని అర్హత ఉంటే వెంటనే వైద్య నిపుణులచే వేయించుకోగలరని ఆమె కోరారు. సరైన సమయంలో వైద్యుల సలహా తీసుకుని అవసరమైన టీకాలు వేయించుకోవడం ద్వారా భవిష్యత్తులో క్యాన్సర్ ముప్పును తగ్గించుకునేందుకు ఒక అవకాశం ఉందని వైద్యురాలు తనకు చెప్పారని వెల్లడించారు. ఆరోగ్యంపై అవగాహన పెంచుకుందాం వ్యాక్సినేషన్‌పై సరైన సమాచారం తెలుసుకుందాం ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ముందడుగు వేద్దాం.” అని డి సాన్వి, డి సన్విర్, డాక్టర్ ప్రశాంతి ప్రజలను కోరారు.

# చౌటుప్పల్ మండల్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ నూతన కమిటీ

**చౌటుప్పల్ వెలుతురు ఆగస్టు 12:**



చౌటుప్పల్ మండలం ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రోజున జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రోజు యజ్ఞమాచారి ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు. తోర్పునూరి సాయిలు గౌడ్. చింతల గణేష్. భారత మధు.వరగంటి వెంకటేష్, నందగిరి పరమేష్, జక్క చలమంద రెడ్డి, అధ్యక్షుడు సుక్క స్వామి. ఉపాధ్యక్షులు .ఎర్ర శివ, వరికుప్పల మహేష్. ప్రధాన కార్యదర్శి. వనం రుషి, కోశాధికారి. రోషణ గారి రాఘవేంద్ర గౌడ్, సహాయ కార్యదర్శి పల్లెర్ల సుజిక్ ,ప్రచార కార్యదర్శి పగడాల శంకర్, కార్యవర్గ సభ్యులు మలిగె రవి. పగిళ్ల మహేష్. డాకోజీ వెంకట శివకుమార్. జాజుల రామకృష్ణ. పెదకంటి నాగేంద్ర గార్లను ఎన్నుకోవడం జరిగింది.

# హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 12:**




కరీంనగర్ నగరంలో భారతీయ జనతా పార్టీ కరీంనగర్ సెంట్రల్ జోన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ గారు నగరంలోని ప్రధాన వీధుల గుండా టవర్ సర్కిల్ వరకు నిర్వహించిన జాతీయ జెండా ర్యాలీలో విద్యార్థులు, యువత, మహిళలు మరియు వందలాది మంది ప్రజలతో కలిసి చేతుల్లో జాతీయ పతాకాలను పట్టుకొని పాల్గొన్నారు. దేశభక్తి నినాదాలతో సాగిన ఈ ర్యాలీ నగర ప్రజల్లో దేశభక్తి భావనను మరింత పెంపొందించేలా నిర్వహించబడింది. ఈ సందర్భంగా మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయడం ద్వారా దేశ సమైక్యత, జాతీయ గౌరవం మరియు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రజలు విస్తృతంగా విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీ వై. సునీల్ రావు గారు, బీజేపీ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు తనుకు సాయికృష్ణ, కార్పొరేటర్లు గుగ్గిల్లపు రమేష్, వంగల పవన్, ఒంటెల సత్యనారాయణరెడ్డి, తాటి ప్రభావతి, గొట్టుముక్కల ఉమారాణి వెంకటరమణ, దేవసాని సరస్వతి సత్యనారాయణ, కో ఆప్షన్ సభ్యులు బల్బీర్ సింగ్, కన్న కృష్ణ, నాయకురాలు వరాల జ్యోతి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో అరటి మొక్కలు నాటిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 12:**



కరీంనగర్ నగరంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాల ఆవరణలో నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు అరటి మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మేయర్ గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ గారు మాట్లాడుతూ, మొక్కలను నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర ఎంతో ముఖ్యమని, చిన్నప్పటి నుంచే ప్రకృతిపట్ల ప్రేమ, చెట్ల పట్ల బాధ్యతాభావం అలవర్చుకోవాలని సూచించారు. పాఠశాలలు విద్యతో పాటు సామాజిక బాధ్యతలను పెంపొందించే కేంద్రాలుగా ఉండాలని ఆయన అన్నారు.అనంతరం విద్యార్థులకు సువర్ణప్రాశన చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మేయర్ గారు మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్యం, రోగనిరోధక శక్తి పెంపొందించేందుకు నిర్వహించే ఆరోగ్య కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. విద్యార్థులు ఆరోగ్యవంతంగా, క్రమశిక్షణతో ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.పాఠశాల యాజమాన్యం నిర్వహిస్తున్న విద్యా, ఆరోగ్య, పర్యావరణ కార్యక్రమాలను మేయర్ గారు అభినందించారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుగ్గిళ్లపు రమేష్, ఏపీపీ చంద్ర, మాసం గణేష్, దేవసాని సరస్వతి సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు – వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

- **ఐదు నెలల్లో మూడు కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాం – ప్రత్యేక బడ్జెట్ సమావేశాన్ని కూడా విజయవంతంగా పూర్తి చేశాం**
- **రికార్డులు చూసి మాట్లాడాలి – రాజకీయ విమర్శల కోసం ప్రజల్లో అపోహలు సృష్టించడం సరికాదు**
- **మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ ఆరోపణలకు కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ ఘాటు కౌంటర్**

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 12:**

కరీంనగర్ నగరపాలక సంస్థలో మూడు నెలలుగా కౌన్సిల్ సమావేశాలు నిర్వహించలేదని, మున్సిపల్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని మాజీ మేయర్, 58వ డివిజన్ కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ చేసిన ఆరోపణలను కరీంనగర్ నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. మేయర్ మాట్లాడుతూ, గత ఐదు నెలల కాలంలో మూడు పర్యాయాలు కౌన్సిల్ సమావేశాలు నిర్వహించామని, అంతేకాకుండా నగర అభివృద్ధికి అత్యంత కీలకమైన బడ్జెట్ సమావేశాన్ని కూడా ప్రత్యేకంగా నిర్వహించి బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదంతో అమలు చేస్తున్నామని తెలిపారు.“కౌన్సిల్ సమావేశాలు జరగడం లేదని చెప్పడం పూర్తిగా అసత్యం. జరిగిన సమావేశాలన్నీ నగరపాలక సంస్థ అధికారిక రికార్డుల్లో ఉన్నాయి. అలాంటప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యం” అని మేయర్ పేర్కొన్నారు.

**మాజీ మేయర్‌గా పనిచేసిన వ్యక్తికే నిబంధనలు తెలియవా?**

సర్దార్ రవీందర్ సింగ్ గతంలో ఇదే నగరానికి మేయర్‌గా పనిచేశారని గుర్తు చేసిన మేయర్, మున్సిపల్ కార్పొరేషన్ పరిపాలన, కౌన్సిల్ సమావేశాల నిర్వహణ, అజెండా ప్రక్రియ, అధికారిక విధానాలపై ఆయనకు పూర్తి అవగాహన ఉండాలని అన్నారు. “మాజీ మేయర్ హోదాలో పనిచేసిన వ్యక్తి అధికారిక రికార్డులను పరిశీలించకుండా, జరిగిన సమావేశాలను కూడా జరగలేదని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమే” అని ఆయన విమర్శించారు.

**కౌన్సిల్‌కు భయపడాల్సిన అవసరం మాకు లేదు**

ప్రజా సమస్యలపై చర్చించేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగానే ఉన్నామని మేయర్ స్పష్టం చేశారు. “కౌన్సిల్ ప్రజాస్వామ్య వేదిక. కార్పొరేటర్లు తమ డివిజన్ల సమస్యలను ప్రస్తావించేందుకు సమావేశాలు నిర్వహించడం మా బాధ్యత. అందుకే ఐదు నెలల్లో మూడు సమావేశాలు నిర్వహించాం. బడ్జెట్‌ను కూడా కౌన్సిల్ ముందుకు తీసుకువచ్చి చర్చించి ఆమోదించాం. భయపడే వారమైతే ఈ సమావేశాలు ఎందుకు నిర్వహిస్తాం?” అని ప్రశ్నించారు.

**ప్రజలకు లెక్కలతో సమాధానం చెబుతున్నాం**

ఆరోపణలు చేయడం సులభమని, కానీ ప్రజలకు వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఉందని మేయర్ అన్నారు. “ఐదు నెలలు – మూడు కౌన్సిల్ సమావేశాలు – ఒక ప్రత్యేక బడ్జెట్ సమావేశం. ఇది రాజకీయ ప్రకటన కాదు. నగర పాలక సంస్థ రికార్డుల్లో పరిశీలించగలిగే వాస్తవం. ఏ సమావేశం ఎప్పుడు జరిగింది, ఏ అజెండాపై చర్చ జరిగింది, ఏ నిర్ణయాలు తీసుకున్నారు అన్న వివరాలన్నీ అధికారిక రికార్డుల్లో ఉన్నాయి” అని తెలిపారు.

**ఫిర్యాదుల రాజకీయాల కంటే అభివృద్ధికి సహకరించండి**

కరీంనగర్ నగరంలో రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, మౌలిక వసతులు, విలీన గ్రామాల అభివృద్ధి తదితర అంశాలపై నగరపాలక సంస్థ నిరంతరం పనిచేస్తోందని మేయర్ పేర్కొన్నారు.“ప్రతి అంశాన్ని రాజకీయ వివాదంగా మార్చడం వల్ల అభివృద్ధి జరగదు. మీరు కూడా ప్రజలు ఎన్నుకున్న కార్పొరేటర్. మీ డివిజన్ సమస్యలను తీసుకురండి. నగర అభివృద్ధికి అవసరమైన సూచనలు చేయండి. మంచి సూచన ఉంటే స్వీకరించడానికి మేము సిద్ధంగా ఉన్నాం. అభివృద్ధికి కలిసి పనిచేద్దాం” అని పిలుపునిచ్చారు.

**‘సోయి లేదా?’ అని అడిగే ముందు**



**వాస్తవాలు తెలుసుకోండి**

“మున్సిపల్ కౌన్సిల్ సమావేశంపై సోయి లేదా?” అని చేసిన వ్యాఖ్యపై మేయర్ స్పందిస్తూ “మాకు కౌన్సిల్‌పై పూర్తి అవగాహన ఉంది. నగర ప్రజల సమస్యలపై కూడా పూర్తి బాధ్యత ఉంది. అందుకే ఐదు నెలల్లో మూడు కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాం. బడ్జెట్ సమావేశాన్ని కూడా పూర్తి చేశాం. ‘సోయి లేదా?’ అని ప్రశ్నించే ముందు జరిగిన సమావేశాల గురించి తెలుసుకునే సోయి కూడా ఉండాలి” అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

**రాజకీయాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు**

కౌన్సిల్ సమావేశాలు, నగర అభివృద్ధి వంటి అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం మానుకోవాలని మేయర్ సూచించారు.<“విమర్శలను స్వాగతిస్తాం. నిర్మాణాత్మక సూచనలను స్వీకరిస్తాం. ప్రజా సమస్యలను కౌన్సిల్‌లో చర్చించడానికి సిద్ధంగా ఉన్నాం. కానీ జరిగిన దాన్ని జరగలేదని చెప్పడం, వాస్తవాలను వక్రీకరించి ప్రజల్లో అపోహలు సృష్టించడం మాత్రం అంగీకరించం. కరీంనగర్ ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. వారికి వాస్తవాలు తెలుసు. మాటల రాజకీయాలు కాదు – పనులతో సమాధానం చెబుతాం. ఆరోపణలు కాదు – అభివృద్ధే మా అజెండా. ప్రజలను తప్పుదోవ పట్టించడం కాదు – కరీంనగర్ అభివృద్ధికి కలిసి రావాలి.” అని కరీంనగర్ నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# ఆస్పైర్ సమ్మిట్ 3.0లో హయత్ నగర్ నారాయణ స్కూల్ హ్యాట్రిక్ విజయం

**హయత్నగర్ వెలుతురు ఆగస్టు 12:**





ఆగస్టు 11వ తేదీన నారాయణ విద్యాసంస్థలు నిర్వహించిన ఆస్పైర్ సమ్మిట్ 3.0 కార్యక్రమం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఘనంగా జరిగింది. గత మూడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ సమ్మిట్‌కు మన హయత్ నగర్ నారాయణ స్కూల్ వరుసగా మూడుసార్లు ఎంపికై హ్యాట్రిక్ సాధించడం విశేషం. కార్యక్రమాన్ని చైర్‌పర్సన్/డైరెక్టర్ పొంగూరి రమాదేవి మేడం మరియు పునీత్ సర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం హయత్ నగర్ నారాయణ స్కూల్ విద్యార్థినులు ప్రదర్శించిన వెల్కమ్ డాన్స్ సభికులను ఆకట్టుకుని విశేష ప్రశంసలు అందుకుంది.ఉపాధ్యాయులు మరియు సిబ్బందిని ప్రోత్సహించి, మరింత ఉత్సాహంతో సేవలందించేలా చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా జీఎం గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి నారాయణ స్కూల్‌లో చదివి మంచి భవిష్యత్తును సాధించేలా ఏజీఎంలు, ప్రిన్సిపాల్స్ తమ వంతు కృషి చేయాలని సూచించారు. నారాయణ విద్యాసంస్థల పేరు ప్రతిష్టలను పెంపొందించి, పేద మరియు మధ్య తరగతి కుటుంబాలు విశ్వసించే విద్యాసంస్థగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏజీఎం రవీంద్రబాబు, ఆర్.అండ్.డీ సభ్యులు శివరంజని, మహేశ్వరి, మీన, ఎన్.పీ.ఎల్ ఇంచార్జి రోహిణి, జోజి రెడ్డి, కోఆర్డినేటర్లు సృజన్, దివ్య, ప్రియాంక, హెచ్‌ఆర్ విలసిత, ప్రిన్సిపాల్స్ లావణ్య రెడ్డి, మానస, ఏవో అనంత చంద్రశేఖర్, డీన్ మంజుల, వైస్ ప్రిన్సిపాల్స్ కవిత, స్వప్న, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ప్రజా సేవలో ఎర్ర సత్యం స్ఫూర్తిదాయకుడు: మంత్రి వాకిటి శ్రీహరి

- **ప్రతి పేదవాడి గుండెలో సత్యమన్న బ్రతికే ఉన్నాడు: మంత్రి వాకిటి శ్రీహరి**

**మహబూబ్ నగర్ వెలుతురు ఆగస్టు 12:**



జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే, స్వర్గీయ ఎర్ర సత్యం వర్ధంతి సభలో రాష్ట్ర కక్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి ,పశు సంవర్ధక, మత్స్య యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ. ఎర్ర సత్యం ప్రజల కోసం నిరంతరం పనిచేసిన ప్రజానాయకుడని కొనియాడారు. సత్యమన్న పేరు వినని వ్యక్తి అంటూ ఎవ్వరూ ఉండరన్నారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలు, పేద ప్రజల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమ ని అన్నారు.ప్రతి పేదవాడి గుండెలో సత్యమన్న బ్రతికే ఉన్నాడని తెలిపారు.పండగ సాయన్న తర్వాత పేదవాళ్లకి న్యాయం చేసిన మహోన్నత వ్యక్తి సత్యమన్న అని ఆయన కొనియాడారు.నమ్ముకున్న సిద్ధాంతం కోసం పని చేసిన గొప్ప వ్యక్తి సత్యమన్న అని మంత్రి పేర్కొన్నారు.

### పండగ సాయన్న స్ఫూర్తితో

పెద్దోళ్లను కొట్టి పేదోళ్ళకి పంచిన మహానుభావుడని తెలియజేశారు. సత్యమన్న సేవలను జయంతి, వర్ధంతి రోజుల్లో కాకుండా ప్రతీ రోజు స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు .ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి వారికి అండగా నిలిచిన ఎర్ర సత్యం జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని మంత్రి పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి తోపాటు మహబూబ్నగర్ ఎమ్మెల్యే ఎన్నం శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్, సాట్స్ మాజీ చైర్మన్ శివసేనా రెడ్డి, డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్,ఎర్ర సత్యం కుటుంబ సభ్యులు, అభిమానులు, పాల్గొన్నారు.



## ప్రపంచ వ్యాప్తంగా ఎల్ నినో ప్రభావం ఉన్నందున ఈసారి తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉంది

- **జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులకు ఎంత నీరు వస్తున్నాయి, ఎంత వదులుతున్నామనే విషయాలని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది : మంత్రి వాకిటి శ్రీహరి**

**వనపర్తి వెలుతురు ఆగస్టు 12:**

ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులను ఆరుతడి పంటలకే వెళ్లే విధంగా ప్రోత్సహించాలని రాష్ట్ర క్రీడా,పాడిపరిశ్రమాభివృద్ధి,పశుసంవర్ధక,మత్స్య,యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు. బుధవారం వనపర్తి జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సాగునీటి సలహా మండలి సమావేశంలో మంత్రులు వాకిటి శ్రీహరి , జూపల్లి కృష్ణారావు లు ముఖ్య అతిథులుగా పాల్గొని రైతులకు సాగు నీరు అందించేందుకు గల అవకాశాలపై ఉమ్మడి జిల్లాల శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్లు, ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షించారు. ఎల్ నినో కారణంగా కరువు పరిస్థితులు, ఉమ్మడి జిల్లా పరిధిలోని జూరాల, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, ఆర్డీఎస్, కే ఎల్ ఐ, బీమా తదితర ప్రాజెక్టుల్లో ప్రస్తుత నీటిమట్టం రాబోయే రోజుల్లో సాగు, తాగు అవసరాలకు సంబంధించి నీటి నిల్వలపై నీటిపారుదల శాఖ, వ్యవసాయ అధికారులతో కలిసి మంత్రులు చర్చించారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో రైతులకు సాగునీటి విడుదలకు సంబంధించిన సాధ్యసాధ్యాల పైన కూడా చర్చించి పలు సూచనలు చేశారు. నీటిపారుదల శాఖ అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం ఎగువన ఉన్న ప్రాంతాల్లో వర్షాలు కురిసిన నేపథ్యంలో అక్కడి నుంచి వరద రావడం వల్ల ప్రస్తుతానికి మన వద్ద ఉన్న ప్రాజెక్టులు నింపుకోవడం జరిగిందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఎగువ ప్రాంతాల నుంచి అనగా ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల జరిగితేనే మనం రైతులకు నీళ్లు ఇవ్వడానికి అవకాశం ఉంటుందని వివరించారు. అక్కడి నుంచి నీటి ప్రవాహం రాకపోతే సాగు కోసం నీరు విడుదల చేయడానికి అవకాశం ఉండదని తెలిపారు. ప్రస్తుతానికి ఆయా ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల ఆపివేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులకు ఎంత నీరు వస్తున్నాయి, ఎంత వదులుతున్నామనే విషయాలని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. అధికారులు జవాబుదారీతనంతో ప్రజలకు అన్ని వివరాలను, వాస్తవాలను తెలియజేయాలని సూచించారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొనడం కరువు పరిస్థితులు ఉన్న నేపథ్యంలో రైతులకు మనం ఏమి ఇవ్వగలము అదే చెప్పాలని వివరించారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వారు ఆరుతడి పంటలు వేసుకునేలా ప్రోత్సాహం కల్పించాలన్నారు. నీటికి సంబంధించి ప్రస్తుతం ఇబ్బందులు ఉన్న నేపథ్యంలో వరి పంటకు పోకుండా వారికి అవగాహన కల్పించాలని తెలియజేశారు. ఎగువ ప్రాంతాల నుంచి నీటి ప్రవాహం వచ్చినప్పుడు రైతులకు తగినంత సాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని, ఒకవేళ ఇన్ఫ్లో




తగ్గిపోతే ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో రైతులకు నీళ్లు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. అదేవిధంగా రైతులకు ఆరుతడి పంటలు వేసుకునే విధంగా పూర్తిస్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించి, అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో రైతులకు సాగునీటి విడుదలకు సంబంధించిన సాధ్యసాధ్యాల పైన కూడా చర్చించి పలు సూచనలు చేశారు. నీటిపారుదల శాఖ అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం ఎగువన ఉన్న ప్రాంతాల్లో వర్షాలు కురిసిన నేపథ్యంలో అక్కడి నుంచి వరద రావడం వల్ల ప్రస్తుతానికి మన వద్ద ఉన్న ప్రాజెక్టులు నింపుకోవడం జరిగిందని తెలిపారు. జూరాల ప్రాజెక్టు సామర్థ్యం 9 టీఎంసీలు కాగా, గతంలో రీజెనరేటెడ్ నీటి సౌకర్యం ఏ విధంగా ఉండేది, ఇప్పుడు ఏ విధంగా ఉందనే విషయాన్ని ఆరా తీసి దానిపై పూర్తి డేటాను వీలైనంత త్వరగా సమర్పించాలని ఆదేశించారు. రైతులకు మినుము, వేరుశనగ, ఆయిల్ పామ్ పంటలపై పూర్తి స్థాయిలో ప్రచారం కల్పించి, అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో శాసనసభ్యులు మేఘా రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రాజేష్ రెడ్డి, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, వంశీ కృష్ణ, విజయుడు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ మాజీ చైర్మన్ శివసేనారెడ్డి, మహబూబ్నగర్ జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్త, నారాయణపేట జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక, గద్వాల జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ హిమంత కేశవ్ పాటిల్, ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖల ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు, వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




## ఇందిరమ్మ LIG టవర్స్ కు శంకుస్థాపన కార్యక్రమం కు పటిష్ట భద్రత

- **300 మంది పోలీసులతో బందోబస్తు..**
- **సభా ప్రాంగణాన్ని పరిశీలించిన సైబరాబాద్ సీపీ**

**హైదరాబాద్, సైబరాబాద్ ఆగస్టు 12:**

కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ LIG టవర్స్ కు శంకుస్థాపన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. యం. రమేష్, బుధవారం సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. బాంబ్ డిస్పోజల్ (బీడీ) బృందంతో ప్రాంగణంలో తనిఖీలు నిర్వహించారు.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సుమారు 300 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. సభా ప్రాంగణంతో పాటు ముఖ్యమంత్రి రాకపోకల మార్గాలు, ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలు, పార్కింగ్ ప్రదేశాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున జనసమ్మర్ధాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో పోలీసు సిబ్బందిని మోహరిస్తామని చెప్పారు.



### ట్రాఫిక్‌కు ప్రత్యేక ప్రణాళిక

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రద్దీ ఏర్పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపులు, ప్రత్యామ్నాయ మార్గాలు, పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. సీఎం కాన్వాయ్ రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మార్గాలను ముందుగానే పరిశీలించి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అనుమానాస్పద వస్తువులు, ఇతర భద్రతా సమస్యలు తలెత్తకుండా ముందస్తు తనిఖీలు చేపట్టాలని సంబంధిత అధికారులను సీపీ ఆదేశించారు.పోలీసు, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని సీపీ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. సభకు వచ్చే ప్రజలు, వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ బద్ధత ఏర్పాటలో పోలీసులు, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కాలభైరవ స్వామిని దర్శించుకున్న మంత్రి కొండా సురేఖ దంపతులు

- **కుమార్తె, అల్లుడితో కాలభైరవ స్వామికి మంత్రి కొండా సురేఖ దంపతుల ప్రత్యేక పూజలు**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 12:**

నాంపల్లి దేవిబాగ్ లోని శ్రీ కాలభైరవ స్వామి ఆలయాన్ని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ గారు– కొండా మురళీధర్ రావు దంపతులు, కుమార్తె సుస్మితా పటేల్, అల్లుడు అభిలాష్ పటేల్‌లతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులంతా కలిసి కాలభైరవ స్వామివారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.కాలభైరవ స్వామికి కాలాన్ని నియంత్రించే దైవస్వరూపంగా హిందూ సంప్రదాయంలో విశిష్టమైన స్థానమున్నదని మంత్రి సురేఖ అన్నారు. పరమశివుని ఉగ్రరూపంగా, క్షేత్రపాలకుడిగా, ధర్మ పరిరక్షకుడిగా భక్తులు కాలభైరవున్ని కొలుస్తారని తెలిపారు. కాలభైరవ స్వామిని ఆరాధించడం ద్వారా భయాలు తొలగి, ధైర్యం, ఆత్మవిశ్వాసం, ఆధ్యాత్మిక బలం చేకూరుతాయని భక్తుల విశ్వాసమని వెల్లడించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కాలభైరవ స్వామిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. ఆలయాల ఆధ్యాత్మిక వైభవాన్ని, పురాతన సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని మంత్రి సురేఖ పేర్కొన్నారు.



ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రి సురేఖ గారితో పాటు, వారి కుటుంబ సభ్యులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వచనాలు అందించారు.

## నార్కట్ పల్లి రోడ్డు పనులు పూర్తి చేయాలంటూ బీజేపీ నాయకుల ధర్నా

- **కనీసం చీకటి పడితే రోడ్ల వెంబడి వెలగని వీధి దీపాలు**
- **రోడ్డు విస్తరణకై బీజేపీ రాస్తారోకో.. రాస్తారోకో భగ్నం చేసిన పోలీసులు**

**నార్కట్ పల్లి వెలుతురు ఆగస్టు 12:**

నార్కట్‌పల్లి పట్టణంలో ప్రధాన రహదారి గుంతలమయంగా మారి నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారుతున్నా రోడ్డు విస్తరణ పనులు పూర్తి కాకపోవడంపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. రోడ్డు విస్తరణ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ నార్కట్‌పల్లి మండల బీజేపీ అధ్యక్షులు మేడబోయిన శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష, రాస్తారోకో ఉద్రిక్తతకు దారితీసింది. ప్రజా ప్రయోజనాలు, వాహనదారుల ప్రాణ రక్షణే లక్ష్యంగా చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకుని భగ్నం చేయడంపై బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మా ప్రాణాలా? రోడ్డు పూర్తి అవ్వడమా? తేల్చుకోండి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. తాము ఎలాంటి స్వప్రయోజనాల కోసం ఈ పోరాటం చేయడం లేదని, రోడ్డు ప్రమాదాల్లో అమాయకుల ప్రాణాలు పోకుండా చూడాలనే ప్రజా ప్రయోజనం కోసం పోరాడుతున్నామని స్పష్టం చేశారు. నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగు తున్నా స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎందుకు మౌ నం వహిస్తున్నారని ప్రశ్నించారు. ప్రజల ప్రాణా లకు సంబంధించిన సమస్యపై ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.

### పోలీసుల తీరుపై బీజేపీ ఆగ్రహం

న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా నిరాహార దీక్ష, రాస్తారోకో చేపడితే పోలీసులను ప్రయోగించి కార్యక్రమాన్ని భగ్నం చేయడం ఎంతవరకు సమంజసమని బీజేపీ నాయకులు నిలదీశారు. ప్రజా సమస్యలపై నిరసన హక్కును అడ్డుకోవడం సరికాదని అన్నారు.



### పోరాటం ఆగేది లేదు

ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా నార్కట్‌పల్లి రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యే వరకు ప్రజల తరఫున తమ పోరాటం కొనసాగుతుందని బీజేపీ శ్రేణులు హెచ్చరించారు. ఇప్పటికైనా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం స్పందించి నార్కట్‌పల్లి రోడ్డు విస్తరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు నడింపల్లి శ్రవణ్ కుమార్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మునుకుంట్ల గణేష్, నోముల నాగరాజు, వడ్డగోని రామలింగం, బిళ్లకంటి శ్రీకాంత్, పమనగుల్ల శివ, కొత్త మహేష్, నాగన్న, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



## హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అపోహలు వీడాలి అవగాహన పెంచాలి

- హెచ్ఐవీ నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి
- ఎయిడ్స్‌పై ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఉంది
- హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి సహకారం అందించాలి
- కొత్తగా హెచ్ఐవీ కేసులు నమోదుకాకుండా చర్యలు అవసరం
- ప్రజల్లో నివారణ మార్గాలపై విస్తృత ప్రచారం చేయాలి
- ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు అవగాహన కార్యక్రమాలు
- రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా కార్యక్రమాల నిర్వహణ
- వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్షకు తావివ్వకూడదు
- 'బీ పాజిటివ్– స్టాప్ హెచ్ఐవీ పాజిటివ్' నినాదంతో ప్రచారం

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 12:**



హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, వ్యాధి నివారణపై అవగాహన పెంచడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. కొత్తగా ఎవరూ హెచ్ఐవీ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి అవసరమైన వైద్య సేవలు, చికిత్స, సామాజిక సహకారం అందించాలని సూచించారు. హెచ్ఐవీ ఉన్న వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా వారికి అండగా నిలవాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు.ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థలు, వివిధ వర్గాల ప్రజల్లో హెచ్ఐవీ నివారణ, పరీక్షలు, చికిత్స, అపోహల తొలగింపుపై అవగాహన కల్పించనున్నారు.ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాల్లో భాగస్వాములై తెలంగాణను హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. బీ పాజిటివ్.. స్టాప్ హెచ్ఐవీ పాజిటివ్ అనే నినాదంతో హెచ్ఐవీ నివారణకు సామూహికంగా కృషి చేయాలని సూచించారు.

## బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట: మంత్రి పొన్నం ప్రభాకర్

- బీసీ సభను విజయవంతం చేయాలి
- 14న పూలే దంపతుల విగ్రహావిష్కరణ
- సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ
- బీసీ ప్రజాప్రతినిధులు ఏకం కావాలి
- కుల సంఘాల నాయకులు భాగస్వామ్యం కావాలి
- సభకు భారీగా తరలిరావాలి
- పూలే దంపతుల ఆశయాలే స్ఫూర్తి
- బీసీల హక్కుల కోసం పోరాటం
- సామాజిక న్యాయానికి ప్రభుత్వం కట్టుబాటు
- కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 12:**

ఈ నెల 14న హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్ ఎదురుగా మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అనంతరం నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం ఏర్పాట్లపై డీఎస్ఎస్ భవన్‌లో బీసీ ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులతో సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పూలే దంపతుల విగ్రహావిష్కరణ



అనంతరం జరిగే సభకు బీసీ ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.సామాజిక సమానత్వం, విద్య, మహిళా సాధికారత కోసం మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే చేసిన కృషి చిరస్మరణీయమని మంత్రి పేర్కొన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లే దిశగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో బీసీ వర్గాలన్నీ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, ఈర్లపల్లి శంకరయ్య, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బాల మయాదేవి, వివిధ కుల సంఘాల చైర్మన్లు, బీసీ సంఘాల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై హైకోర్టు స్టే

- ప్రభుత్వ కౌంటర్‌పై ప్రశ్నలు
- నాలుగు వారాల గడువు పూర్తి
- కౌంటర్ దాఖలు కాలేదని వాదన
- తదుపరి విచారణ నాలుగు వారాలకు
- పథకాల అమలుపై ప్రభావం
- పూర్తి ఉత్తర్వులపై ఆసక్తి

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 12:**

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై హైకోర్టు స్టే విధించినట్లు తాజా సమాచారం. ఈ పథకాలను చట్టసభల ఆమోదం లేకుండా కేవలం ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా అమలు చేస్తున్నారంటూ న్యాయవాది విజయ్ గోపాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ పరిణామం చోటుచేసుకుంది.కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుకు ప్రత్యేకంగా చట్టబద్ధమైన ఆధారం లేదని, కేవలం ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారంగా పథకాలను కొనసాగించడం సరికాదని పిటిషనర్ వాదించినట్లు సమాచారం. చట్టసభల్లో తీర్మానం లేదా చట్టం చేయకుండా ఇటువంటి ఆర్థిక ప్రయోజనాలను కల్పించే పథకాలను అమలు చేయడం చట్టబద్ధతకు సంబంధించిన ప్రశ్నలను లేవనెత్తుతుందని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.ఈ పిటిషన్‌పై గతంలో విచారణ జరిపిన హైకోర్టు.. పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలపై ప్రభుత్వం తన వాదనలను తెలియజేస్తూ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.



అయితే కోర్టు ఇచ్చిన నాలుగు వారాల గడువు పూర్తయినా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయలేదని విజయ్ గోపాల్ తాజాగా న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.ఈ నేపథ్యంలో హైకోర్టు పథకాలపై స్టే విధిస్తూ తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసినట్లు సమాచారం. అయితే స్టే ఉత్తర్వుల పూర్తి పాఠం అందుబాటులోకి వచ్చిన తర్వాతే ఈ ఆదేశాలు రెండు పథకాల మొత్తం అమలుపైనా, లేక పిటిషన్‌లోని నిర్దిష్ట అంశాలపైనా వర్తిస్తాయా అన్నది స్పష్టంగా చెప్పాల్సి ఉంటుంది.కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం వివాహ సమయంలో ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ పథకాలు రాష్ట్రంలో చాలాకాలంగా అమల్లో ఉన్నాయి. తాజా హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వం తదుపరి విచారణలో తన వాదనలను సమర్పించాల్సి ఉంటుంది.

# ఇమ్రాన్ ఖాన్ మృతి ?

- పాకిస్థాన్ మీడియాలో జోరుగా ప్రచారం
- ఖండించిన పాక్ సైన్యం
- ఇమ్రాన్ మృతిపై సంచలన పోస్ట్
- ముగ్గురు సైనికాధికారులు చెప్పారన్న జర్నలిస్ట్
- ఆరోపణలపై కలకలం
- ఇమ్రాన్ ఆరోగ్యంపై ఆందోళన
- కుటుంబసభ్యులకు భేటీ నిరాకరణ
- వైద్యులకూ అనుమతి లేదన్న పీటీఐ
- వీధుల్లోకి వస్తామన్న పార్టీ
- 20 లక్షల మంది సిద్ధంగా ఉన్నారన్న నేత
- సెప్టెంబర్ 27న భారీ ర్యాలీ ప్రకటన
- మరణవార్తలను ఖండించిన పాక్ సైన్యం

**ఇస్లామాబాద్, వెలుతురు, ఆగస్టు 12:**

పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ మృతి చెందినట్లు ఓ పాకిస్థానీ జర్నలిస్ట్ చేసిన సంచలన ఆరోపణలు ఆ దేశంలో తీవ్ర కలకలం రేపాయి. జైలులో ఉన్న ఇమ్రాన్ ఖాన్ మరణించారని ముగ్గురు సీనియర్ సైనికాధికారులు తనకు చెప్పినట్లు జర్నలిస్ట్ వజాహత్ సయీద్ ఖాన్ పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలకు ఇప్పటివరకు అధికారిక ధ్రువీకరణ లేదు. పైగా పాకిస్థాన్ సైన్యం ఇమ్రాన్ ఖాన్ మృతి వార్తలను నిరాధారమైనవిగా ఖండించింది.ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై ఇప్పటికే ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఈ ఆరోపణలు మరింత ఉద్రిక్తతకు దారితీశాయి. జైలులో ఉన్న తమ నేతను కలిసేందుకు కుటుంబసభ్యులు, వైద్యులకు అనుమతి ఇవ్వడం లేదని పాకిస్థాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ ఆరోపిస్తోంది. దీంతో ఇమ్రాన్ ఖాన్ పరిస్థితిపై పార్టీ కార్యకర్తలు, అభిమానుల్లో



అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.తమ నేతకు ఏదైనా జరిగితే భారీ స్థాయిలో ప్రజలను సమీకరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీధుల్లోకి వస్తామని పీటీఐ నేతలు హెచ్చరిస్తున్నారు. ఖైబర్ పఖ్తుంఖ్వా ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిది మాట్లాడుతూ తమ నేతకు ఏదైనా జరిగితే సుమారు 20 లక్షల మంది యువత వీధుల్లోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. యువత ఆగ్రహాన్ని అదుపు చేయడానికి మొత్తం సైన్యం కూడా సరిపోదని వ్యాఖ్యానించారు.ఇమ్రాన్ ఖాన్‌ను కలిసేందుకు ఆయన కుటుంబసభ్యులు, వైద్యులకు ప్రవేశం నిరాకరిస్తే నిరసనలు చేపడతామని పీటీఐ హెచ్చరించింది. ఇస్లామాబాద్ వైపు సెప్టెంబర్ 27న భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించింది.ఇదిలా ఉండగా, ఇమ్రాన్ ఖాన్ మృతిపై వచ్చిన వార్తల నేపథ్యంలో పాకిస్థాన్‌లో రాజకీయ ఉత్కంఠ పెరిగింది. అయితే పాక్ ప్రభుత్వం, జైలు అధికారులు ఆయన మృతిపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మరోవైపు పాకిస్థాన్ సైన్యం మాత్రం మరణవార్తలను ఖండించింది. దీంతో ప్రస్తుతం ఇమ్రాన్ ఖాన్ మృతి వార్తను ధ్రువీకరించినట్లుగా చెప్పడం సాధ్యం కాదు.ఇమ్రాన్ ఖాన్ జైలులో ఉండటం, కుటుంబ సభ్యులకు భేటీపై ఆంక్షలు, ఆయన ఆరోగ్యంపై గతంలోనూ వ్యక్తమైన ఆందోళనలు తాజా పరిణామాలకు కారణమయ్యాయి. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో వస్తున్న ప్రతి సమాచారాన్ని అధికారిక ధ్రువీకరణ లేకుండా నమ్మవద్దని పరిస్థితిని గమనిస్తున్న వర్గాలు సూచిస్తున్నాయి.

## ఏ రాష్ట్రం లో ఓటు ఉండాలో ప్రకాష్ రాజ్ నిర్ణయించుకోవాలి...

(మొదటి పేజీ తరువాయి)

బిఎల్ఓలు ప్రకాష్ రాజు కు ఫోన్ చేసినప్పుడు కూడా తాను ఆ అడ్రస్ లో ఉండటం లేదని స్పష్టం చేశారనీ అన్నారు. ఓట్ షిఫ్టింగ్ కింద మాత్రమే ఆయన ఓటును అక్కడి నుంచి తీసేసారని సంగప్ప వివరించారు. ప్రకాష్ రాజ్ ఎక్కడ ఓటు వేయాలనుకుంటున్నారో అక్కడ అడ్రస్ తో ఫామ్ 6 ఇవ్వాలని, ఆయనకు ఓటు వస్తుందని సంగప్ప చెప్పారు. కేవలం కేంద్ర ప్రభుత్వంపై బురద జల్లాలని డ్రామాలాడి ఇప్పుడు ప్రకాష్ రాజే అబాసపాలయ్యారని సంగప్ప ఎద్దేవ చేశారు. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ సాయి ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు జన వాడే సంగప్ప అన్నారు. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగుల్ని తీవ్ర ఒత్తిడికి గురిచేసి చంపుతున్నారని రాష్ట్ర ప్రభుత్వంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో తీవ్రమైన ఒత్తిడి ఉందని, దాన్ని తట్టుకోలేని వారు పిట్టల రాలిపోతున్నారని సంగప్ప ఆవేదన వ్యక్తం చేశారు. దీనంతటికీ సిబ్బంది కొరత కారణమని, దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన విమర్శించారు. పోలీస్ శాఖలో ఖాళీలను భర్తీ చేయాల్సిపోయి తానింతే... మీరే ఎండ్రిన్ తాగి చావండి అంటూ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం ఆయన బాధ్యత రాహిత్యానికి నిదర్శనమని సంగప్ప ఆరోపించారు. పాలకులు ప్రజల్లో ఆత్మ స్థైర్యాన్ని నింపాలి కానీ ఇట్లాంటి వ్యాఖ్యలు చేసి వాళ్ల చావుకు కారణం కావద్దని ఆయన హితవు చెప్పారు. రేవంత్ రెడ్డి సీఎం కాకముందు గత ప్రభుత్వంలో పోలీస్ శాఖకు జరిగిన నష్టాల పైన పదేపదే మాట్లాడితి ఆ మాటలను పోలీసు కుటుంబాలు నమ్మి ఓటేశాయని అన్నారు. ఆనాడు పోలీసులకు డిఏలు, టీఏలు , సరెండర్ లీవ్ లు, అడిషనల్ లీవులు, ప్రమోషన్లు లేవన్న రేవంత్ రెడ్డి మరి ఆయన ముఖ్యమంత్రి అయ్యాక ఎందుకు ఇవ్వడం లేదని సంగప్ప నిలదీశారు. ఈ రెండున్నర ఏళ్లలో ఒక్కొక్క కానిస్టేబుల్ కి వేల రూపాయల డిఏలు పెండింగ్ ఉన్నాయని, సరెండర్ లీవులు, అడిషనల్ లీవులు ఇస్తానే లేరని ఆయన విమర్శించారు. కానిస్టేబుల్ సాయికుమార్ మృ తి పై ఆయన కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారని, ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలు తెలపాలని సంగప్ప డిమాండ్ చేశారు. ఈ ప్రెస్ మీట్ లో సంగప్ప తోపాటు నామాని మహేష్ కుమార్, పాల్గొన్నారు.

## నిమిషానికి రూ.20 లక్షల అప్పు.. ప్రజలకు నిధులేవీ?: ఏలేటి మహేశ్వర్ రెడ్డి

- రూ.4 లక్షల కోట్లకు పైగా అప్పులు
- రూ.లక్ష కోట్ల బకాయిలు పేరుకుపోయాయి
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు
- ఉద్యోగుల బకాయిలపై నిర్లక్ష్యం
- మూసీ పేరుతో వేల కోట్ల ఖర్చు
- కాంట్రాక్టర్లకు పెద్దపీట
- ప్రభుత్వ ప్రాధాన్యాలపై ప్రశ్నలు
- ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 12:**



తెలంగాణ ఆర్థిక పరిస్థితి దారుణంగా మారిందని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా అప్పులు చేస్తూ ప్రజలకు చెల్లించాల్సిన బకాయిలను మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గత నాలుగు నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వం రూ.34,900 కోట్ల అప్పు చేసిందని, అంటే నిమిషానికి రూ.20.20 లక్షల చొప్పున రుణం తీసుకుంటోందని ఆరోపించారు. ఇప్పటివరకు ప్రభుత్వం రూ.4 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసినప్పటికీ ఆ నిధులను ఎక్కడ ఖర్చు చేశారో ప్రజలకు వివరించాలని ఏలేటి డిమాండ్ చేశారు. వివిధ వర్గాలకు చెల్లించాల్సిన దాదాపు రూ.లక్ష కోట్ల బకాయిలు పేరుకుపోయాయని ఆరోపించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్, సింగరేణి, ఆర్టీసీ బకాయిలతో పాటు ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన మొత్తాలను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని విమర్శించారు. 30 నుంచి 40 ఏళ్లపాటు ప్రభుత్వానికి సేవలందించిన రిటైర్డ్ ఉద్యోగులు తమ పెన్షన్, ఇతర ప్రయోజనాల కోసం కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రజల అవసరాలకు నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం మరోవైపు మూసీ, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని ఏలేటి ఆరోపించారు. కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చేందుకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు.

గ్రామాలు, పట్టణాల్లో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక సమస్యలు పరిష్కారం కాకుండానే భారీ ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టి పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజల అవసరాలకు నిధులు కేటాయించకుండా కాంట్రాక్టర్లకు వేల కోట్ల రూపాయలు ఎలా కేటాయిస్తారని నిలదీశారు.రాష్ట్రంలో ఆర్థిక అత్యవసర పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వం చేసిన అప్పులు, పెండింగ్ బకాయిలు, భారీ ప్రాజెక్టుల వ్యయంపై సమగ్ర లెక్కలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.అవినీతి, కాంట్రాక్టర్ల బిల్లులు, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలపై ఏసీబీ, లోకాయుక్తతో విచారణ జరిపించాలని కోరారు. ప్రజలపై మరింత ఆర్థిక భారం మోపకుండా ప్రభుత్వం తన ప్రాధాన్యాలను మార్చుకోవాలని ఏలేటి సూచించారు.

## పట్టణ పీహెచ్‌సీల్లో లైంగిక వేధింపుల ఫిర్యాదులకు ఈ-రిజిస్ట్రేషన్ డ్రైవ్

- డా. పుట్ల శ్రీనివాస్ హైదరాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 12:**






హైదరాబాద్ జిల్లాలోని అన్ని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మహిళ ఉద్యోగి పై లైంగిక వేధింపు పై ఇంటర్నల్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, హైదరాబాద్, మరియు యాక్షన్ ఎయిడ్ అసోసియేషన్ తో కలిసి కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ చట్టం యొక్క ప్రధాన ఉద్దేశం మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన మరియు వేధింపులేని ప్రదేశాన్ని కల్పించడం అని తెలియజేశారు. ★పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా ఉద్యోగుల భద్రత మరియు పిర్యాదుల పరిష్కార వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత నోడల్ ఆఫీసర్స్ కు , మరియు ఇంటర్నల్ కమిటీ సభ్యులకు మార్గదర్శకాలు, సాంకేతిక సహాయం అందించారు అని తెలియజేశారు. ఈ సమన్వయ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో మరింత సురక్షితమైన, సమానత్వంతో కూడిన మరియు మహిళలకు అనుకూలమైన కార్యాలయ వాతావరణాన్ని ఏర్పాటు చేయడంలో గణనీయమైన పురోగతి సాధించగలమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 91 ఇంటర్నల్ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగింది. తెలంగాణ షి బాక్స్ పోర్టల్ లో యాక్షన్ ఎయిడ్ అసోసియేషన్, మహిళ అభివృద్ధి &శిశు సంక్షేమ శాఖ వారి సహకారంతో రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది అని తెలియజేశారు.ఇంకా ఈ కార్యక్రమంలో డా.అనిత అడిషనల్ డిఎంహెచ్ఓ , డా. శ్రీకళ ప్రోగ్రామ్ ఆఫీసర్,వందన పౌల్ బర్ధరూ యాక్షన్ ఎయిడ్ అసోసియేషన్ ,దీపికా, వైద్యాధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# గరిష్ట స్థాయిలో గోదావరి జలాల వినియోగం



- సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టుల్లో ఎన్డీఎస్ఏ సూచనలు పాటించాలి...
- పరిహారం.. పునరావాసం చెల్లింపులు వేగవంతం చేయండి..
- గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుపై కన్సల్టెన్సీని నియమించండి..
- నీటి పారుదల సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 12:**

గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎల్లంపల్లితో పాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేరకు ఎత్తిపోతలు చేపట్టాలన్నారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి నీటి పారుదల శాఖపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో బుధవారం సమీక్ష నిర్వహించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సూచనల మేరకే సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో నీరు నిల్వ చేయడం లేదని, ఈ విషయంలో ఎన్డీఎస్ఏ సూచనలు పాటించాలన్నారు. మేడిగడ్డతో పాటు సుందిళ్ల బ్యారేజీలోనూ అనేక లోపాలు ఉన్నట్లు తేలిందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

ఈ విషయంలో ఎన్డీఎస్ఏతో సంప్రదించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. దేవాదుల నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా 9 పంపులతో ఎత్తిపోతలు చేపట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి ఎత్తిపోతలకు సంబంధించి ఏవైనా చిన్న చిన్న సమస్యలుంటే అధికారులు వాటి పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని సీఎం సూచించారు. పలు ప్రాజెక్టుల కింద ఒకట్రెండు గ్రామాలు, కొద్ది పాటి వ్యవసాయ భూములకు పరిహారం చెల్లింపు అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించేందుకు కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశించారు. నీటి పారుదల, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు, పరిహారం, పునరావాసానికి సంబంధించి వాస్తవ నివేదిక రూపొందించాలని సీఎం ఆదేశించారు.

తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని సీఎం సూచించారు. అధికారులు ఆ పనులను పూర్తి చేస్తే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టుల్లో నీరు నింపే అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల సామర్థ్యం పెంపునకు సంబంధించి సమగ్ర అధ్యయనం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గూడెందొడ్డి పంప్డ్‌స్టోరేజీ ప్రాజెక్టుకు సంబంధించి కన్సల్టెంట్ నియమించాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ కార్యదర్శి ఈ.శ్రీధర్, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివ కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ముంబైలో మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజేష్ అగర్వాల్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఐఏఎస్

**హైదరాబాద్, ఆగస్టు 12:**

తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు, IAS., బుధవారం ముంబైలో మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ రాజేష్ అగర్వాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి ప్రగతి, 'రైజింగ్ తెలంగాణ–2047' విజన్ తదితర అంశాలను శ్రీ సంజయ్ జాజు వివరించారు. తెలంగాణ–మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య ఉన్న సత్సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడం, పరస్పర సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలపై ఇరువురు చర్చించారు.

అనంతరం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) CMD శ్రీ సి.ఎస్. శెట్టిను ముంబైలో కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, 'రైజింగ్ తెలంగాణ–2047' లక్ష్యాలు తదితర అంశాలను ఆయన ఎస్‌బీఐ సీఎండీకి వివరించారు.

తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను శ్రీ సంజయ్ జాజు వివరించారు.



# ఎఫ్ సీఆర్ఏ సవరణ బిల్లు జేపీసీకి..
# లోక్‌సభ ఆమోదం

- కమిటీలో 21 మంది లోక్‌సభ సభ్యులు
- రాజ్యసభ నుంచి 10 మంది సభ్యులకు అవకాశం
- ఎఫ్ సీఆర్ఏ సవరణ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విపక్షాలు
- మైనారిటీలు, ఎన్జీవోలను లక్ష్యంగా చేసుకున్నారన్న కాంగ్రెస్ ఆరోపణ
- బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని కేసీ వేణుగోపాల్ డిమాండ్
- విపక్షాలన్నీ బిల్లును వ్యతిరేకిస్తున్నాయన్న అఖిలేష్ యాదవ్
- చట్టపరమైన కార్యాచరణ లేకుండా విదేశీ నిధులను అనుమతించలేమన్న కేంద్రం

**న్యూఢిల్లీ, వెలుతురు, ఆగస్టు 12:**

లోక్‌సభలో ఇటీవల ప్రవేశపెట్టిన విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్ సీఆర్ఏ ) సవరణ బిల్లుపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతిపాదిత బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని లోక్‌సభ ఆమోదించింది.

### 31 మంది ఎంపీలతో జేపీసీ

ఎఫ్ సీఆర్ఏ సవరణ బిల్లును పరిశీలించేందుకు మొత్తం 31 మంది ఎంపీలతో జేపీసీని ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 21 మంది లోక్‌సభ సభ్యులు, 10 మంది రాజ్యసభ సభ్యులు ఉండనున్నారు. కమిటీ బిల్లులోని ప్రతిపాదిత నిబంధనలను పరిశీలించి, వివిధ వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది.

### విపక్షాల తీవ్ర అభ్యంతరం

కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ ఎఫ్ సీఆర్ఏ సవరణ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. మైనారిటీలు, ఎన్జీవోలను లక్ష్యంగా చేసుకునే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చిందని ఆరోపించారు. బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ సైతం బిల్లును వ్యతిరేకించారు. ప్రతిపక్ష పార్టీలన్నీ ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఉన్నాయని తెలిపారు.


### కేంద్రం వివరణ

విపక్షాల ఆరోపణలపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. చట్టపరమైన కార్యాచరణ లేకుండా విదేశీ నిధులను దేశంలోకి అనుమతించలేమని స్పష్టం చేశారు. ఎఫ్ సీ ఆర్ఏ సవరణ బిల్లులో మైనారిటీలను లక్ష్యంగా చేసుకునేలా ఎలాంటి నిబంధనలు లేవని తెలిపారు.బిల్లుపై విపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని రిజిజు ఆరోపించారు. విదేశీ విరాళాల వినియోగంలో పారదర్శకత, చట్టబద్ధత ఉండాల్సిన అవసరం ఉందని కేంద్రం వాదిస్తోంది.

### జేపీసీలో చర్చకు అవకాశం

విపక్షాల అభ్యంతరాల నేపథ్యంలో బిల్లును నేరుగా ఆమోదించే బదులు జేపీసీకి పంపించాలని కేంద్రం నిర్ణయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. కమిటీ బిల్లులోని నిబంధనలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం తన నివేదికను పార్లమెంట్‌కు సమర్పించనుంది.దీంతో ఎఫ్ సీఆర్ఏ సవరణ బిల్లుపై అధికార, ప్రతిపక్షాల మధ్య కొనసాగుతున్న వివాదం ఇక జేపీసీ పరిశీలనకు వెళ్లనుంది. కమిటీలో జరిగే చర్చలు, వివిధ వర్గాల అభిప్రాయాల ఆధారంగా బిల్లులో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.



# క్యూర్ పరిధిలో నేడు ఇందిరమ్మ టవర్స్‌కు శ్రీకారం

- **తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో 8 వేల ఇళ్ల నిర్మాణం**
- **అర్హులైన పేదలకు పారదర్శకంగా లక్కీడిప్ ద్వారా కేటాయింపు**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 12:**

హైదరాబాద్ మహానగరంలో ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురు చూస్తున్న నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల కలను సాకారం చేసే దిశగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక అడుగు వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.క్యూర్ పరిధిలో చేపడుతున్న ప్రతిష్టాత్మక ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి గురువారం (13వ తేదీ) సాయంత్రం కూకట్‌పల్లి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు స్వయంగా శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. ఇళ్ల నిర్మాణంపై బుధవారం అధికారులతో మంత్రిగారు సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ కూకట్‌పల్లిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు శంకుస్థాపన చేయనున్న ఐదు ఎకరాల ప్రాంతంలో నాలుగు టవర్స్ నిర్మిస్తామని ఒక్కో టవర్‌లో 120 చొప్పున ఫ్లాట్స్ ఉంటాయన్నారు. ఒక్కో ఫ్లోర్‌లో 12 ఫ్లాట్స్ ఉండేలా 480 ఫ్లాట్స్ నిర్మాణం జరుగుతుందని దీనికోసం 43.20 కోట్ల రూపాయిలు ఖర్చవుతుందని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ఇంతవరకు సుమారు 90 ఎకరాలను ఎంపిక చేశామని మంత్రి గారు తెలిపారు. హైదరాబాద్ నగరం నడిబొడ్డున పేదవాడి ఇంటికి పునాది వేయడం అంటే కేవలం ఒక భవనం నిర్మించడం కాదు.. ఒక కుటుంబానికి భద్రత, ఒక తరానికి భరోసా, పేదవాడికి గౌరవంతో కూడిన జీవితం అందించడమే అని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్న నేపథ్యంలో నగరంలోనే సొంత ఇల్లు కావాలనే పేదల ఆకాంక్షను నెరవేర్చేందుకు ఇందిరమ్మ టవర్స్‌ను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు.క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం హైదరాబాద్ గృహ నిర్మాణ రంగంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదలు నగరానికి దూరంగా కాకుండా.. నగరంలోనే గౌరవంగా జీవించాలి అనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును రూపొందించిందన్నారు.నగరంలోని కీలక ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను సద్వినియోగం చేసుకుని బహుళ అంతస్తుల టవర్లను నిర్మించడం ద్వారా వేలాది పేద కుటుంబాలకు సొంతింటిని అందించనున్నామని తెలిపారు. ఇది ఒకసారి చేపట్టి ముగించే పథకం కాదని, హైదరాబాద్‌లో పేదల గృహ అవసరాలను దశలవారీగా తీర్చే నిరంతర గృహ నిర్మాణ కార్యక్రమని స్పష్టం చేశారు.క్యూర్ పరిధిలో ఈ ఏడాది లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని , తొలి విడతలో ప్రయోగాత్మకంగా 16 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సుమారు 8,000 ఇళ్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు.ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సంబంధించి గత నెల 20వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించామని, ఇప్పటివరకు సుమారు 50 వేల దరఖాస్తులు అందాయని మంత్రి తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని దరఖాస్తుల స్వీకరణ గడువును ఆగస్టు 15వ తేదీ వరకు పొడిగించినట్లు చెప్పారు.ఇందిరమ్మ టవర్స్‌లో లబ్ధిదారులకు అందించే ఇళ్లు సౌకర్యవంతంగా, ఆధునిక



ప్రమాణాలతో నిర్మించనున్నామని తెలిపారు. ప్రతిపాదిత ఇంటిలో ఒక బెడ్‌రూమ్, హాల్, కిచెన్‌తో కలిపి సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంటుందని చెప్పారు.

నగరంలోని అత్యంత కీలక ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి పది అంతస్తుల వరకు టవర్లను నిర్మించనున్నట్లు వివరించారు. ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న ఈ ఇళ్లలో లబ్ధిదారుడి పేరుతో అన్‌డివైడెడ్ షేర్ కింద సుమారు 20 నుంచి 25 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. కొన్ని ప్రాంతాల్లో ఒక్కో లబ్ధిదారుడికి లభించే భూమి వాటా విలువ సుమారు రూ.60 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటుందన్నారు.

ఇలాంటి విలువైన ప్రాంతాల్లో పేదలకు సొంతింటి అవకాశం కల్పించడం దేశంలోని ఇతర మహానగరాలకు కూడా ఆదర్శంగా నిలిచే విధంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

దరఖాస్తుల స్వీకరణ అనంతరం అర్హతలను పూర్తిస్థాయిలో పరిశీలించి, ఎలాంటి రాజకీయ జోక్యం, సిఫార్సులు, అవకతవకలకు తావులేకుండా అర్హులైన పేదల నుంచి పారదర్శక పద్ధతిలో డ్రా/లక్కీడిప్ ద్వారా ఇళ్ల కేటాయింపు చేపడతామని తెలిపారు.

ఇల్లు మంజూరు కాని దరఖాస్తుదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారు చెల్లించిన ఈఎండీ మొత్తాన్ని వెంటనే తిరిగి చెల్లిస్తామన్నారు.

ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా, వేగంగా పూర్తి చేసి వచ్చే ఏడాది బోనాల పండుగ సమయానికి ఎంపికైన లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

శంకుస్థాపన నుంచి నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రతి దశను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, నిర్ణీత గడువులో నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.

గత ప్రభుత్వాల హయాంలో పేదలకు ఇళ్ల విషయంలో హామీలు మాత్రమే మిగిలాయని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మాత్రం హామీలను కార్యరూపంలోకి తీసుకువచ్చి, పేదల ఇంటి తలుపు తట్టేలా గృహ నిర్మాణ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తోందని మంత్రి పేర్కొన్నారు.

## మిల్లర్ల నుంచి బకాయిలు వసూలు చేయాల్సిందే...

- **పౌరసరఫరాల సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 12:**

మిల్లర్లు బకాయిపడిన ధాన్యం విలువకు సంబంధించిన మొత్తాన్ని వసూలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపే వారితో సానుకూలంగా ఉంటామని, ఉద్దేశపూర్వకంగా ఎగవేతలకు ప్రయత్నించే వారితో కఠినంగా వ్యవహరిస్తామని సీఎం హెచ్చరించారు. పౌరసరఫరాల శాఖపై ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో బుధవారం సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం రూ.వేల కోట్ల బకాయిలకు అవకాశం ఇచ్చి.. తిరిగి ఆ తప్పిదాన్ని తమ ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఇప్పటికే బకాయిల వసూలులో కొంత పురోగతి ఉందని, అయితే ప్రతి ధాన్యం గింజకు చెందిన బకాయిని వసూలు చేయాల్సిందేనన్నారు. బకాయిల వసూలుకు సంబంధించి విధి విధానాల రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. విధివిధానాల రూపకల్పన పూర్తయిన తర్వాత ఆ నివేదికను మంత్రివర్గ ఉప సంఘానికి సమర్పించాలని సీఎం సూచించారు. మంత్రివర్గ ఉప సంఘం పరిశీలన అనంతరం ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మొండి బకాయిదారులుగా మారిన మిల్లర్లకు కేటాయించే ధాన్యాన్ని మహిళా సంఘాలకు కేటాయించి మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతి సీజన్‌లో ధాన్యం నిల్వకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే తగు కార్యాచరణ రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ధాన్యం భారీగా వచ్చే నల్గొండ, సూర్యాపేట, నిజామాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో సైలో బ్యాగ్ నిర్మాణాలను పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల (SHG) ఆధ్వర్యంలో సైలో బ్యాగ్ నిర్మాణాలకు నియోజకవర్గానికి 50 నుంచి 100 ఎకరాల భూమిని కేటాయిస్తామని సీఎం తెలియజేశారు. వీటి నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ, పౌరసరఫరాలు, మహిళా సంక్షేమ శాఖల మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వీబీ జీ రామ్ జీ లో ఫ్లాట్‌పాంల నిర్మాణానికి అవకాశం ఉన్నందున, విశాలమైన ఫ్లాట్‌పాంలు నిర్మించి జర్మన్ టెంట్లతో ధాన్యం నిల్వకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. మండల, గ్రామ స్థాయిలో ఉన్న ప్రైవేటు గోదాములు, ధాన్యం నిల్వకు ఉపయోపపడే కల్యాణ మండపాలు, పాత థియేటర్లు, ఇతర షెడ్లను ముందుగానే గుర్తించి ధాన్యం నిల్వకు లీజుకు తీసుకోవాలని సీఎం సూచించారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, పౌరసరఫరాల సంస్థ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సౌత్ ఇండియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తూడి దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com